28న మెగా ఉద్యోగ మేళా

ఖమ్మం సారథినగర్, న్యూస్‌టుడే: ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో ఖమ్మం ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ కళాశాలలో మెగా ఉద్యోగ మేళాను శనివారం నిర్వహించనున్నట్టు ఉపాధి కల్పనాధికారి మాధవి బుధవారం తెలిపారు. 18 నుంచి 40 ఏళ్ల వయసు గల వారికి ఉద్యోగ అవకాశాలుంటాయని, 850 ఖాళీల భర్తీ లక్ష్యంగా 16 కార్పొరేట్ సంస్థలు వస్తున్నాయని చెప్పారు. పదోతరగతి నుంచి డిగ్రీ విద్యార్హత ఉన్నవారందరికీ తగిన ఉద్యోగావకాశాలు కల్పించేలా అధికారులు జాబ్‌మేళాను రూపొందించారని తెలిపారు. అదనపు సమాచారం కోసం నంబర్ 90638 58341 ను సంప్రదించాలని సూచించారు.

భావితరాలకు ఉపయోగపడేలా అభివృద్ధి: మంత్రి తుమ్మల


కార్యక్రమంలో మంత్రి తుమ్మల, నగర మేయర్ నీరజ తదితరులు

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా ఖమ్మం నగరాన్ని తీర్చిదిద్దనున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం కార్పొరేషన్ 16వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. విద్యుత్ తీగలకు అడ్డు రాకుండా మొక్కలు నాటాలన్నారు. ఆక్రమణల కారణంగా వరదలు వస్తున్నాయని, స్థలాల కబ్జాలను సహించేది లేదని స్పష్టం చేశారు. తన పక్కన తిరిగేవారైనా వదిలిపెట్టనని హెచ్చరించారు. వెలుగుమట్ల పార్కును సుందరంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని చెప్పారు. ప్రజలు సంపూర్ణంగా సహకరించాలని కోరారు. ఎత్తుపల్లాలు లేకుండా నీరు సునాయాసంగా ప్రవహించేలా మురుగు కాల్వలు నిర్మించాలన్నారు. నాణ్యతలో ఎక్కడా రాజీ పడవద్దని స్పష్టం చేశారు. రైల్వే వంతెన, రహదారుల నిర్మాణం కారణంగా ధంసలాపురం, శ్రీరాంనగర్, ముస్తఫానగర్ ప్రాంతాలు ఎంతో అభివృద్ధి సాధించాయని చెప్పారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్ మేడారపు వెంకటేశ్వర్లు, నగర పాలక సంస్థ సహాయ కమిషనర్ సంపత్, ప్రజారోగ్య శాఖ ఈఈ రంజిత్‌రెడ్డి, నాయకులు సాధు రమేశ్‌రెడ్డి, ఆళ్ల వెంకటరెడ్డి రావూరి సైదుబాబు, తుపాకుల ఎలగొండ స్వామి, ఆళ్ల అంజిరెడ్డి, ఎం.బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

దశ మారాలంటే.. దిశానిర్దేశం కావాలి..!

ఈటీవీ, ఖమ్మం



కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సమీక్షించి.. అర్హులకు లబ్ధి చేకూరేలా దిశ కమిటీ చొరవ చూపాల్సి ఉంటుంది. మూడు నెలలకు ఓసారి సమావేశం జరగాలి. 2019లో ఎన్నికైన లోక్‌సభ సభ్యుల పదవీకాలం ముగిసిందని ఇప్పటికే జిల్లా యంత్రాంగం నుంచి ప్రకటన విడుదలైంది. కొత్త కమిటీ సమావేశం నిర్వహణకు మరికొంత సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఖరారు కాని తేదీలు..

దిశ కమిటీ సమావేశాలు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో జరగాల్సి ఉంది. ఈ ఏడాది మేనెలలో పార్లమెంట్ ఎన్నికలు జరగ్గా.. జూన్ 4న ఫలితాలు వెలువడ్డాయి. ఖమ్మం ఎంపీగా రామసహాయం రఘురాంరెడ్డి, మహబూబాబాద్ ఎంపీగా పోరిక బలరాంనాయక్ ఎన్నికయ్యారు. లోక్‌సభ స్థానాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీలు ఛైర్మన్లుగా వ్యవహరిస్తారు. వీరి ఆధ్వర్యంలో మూడునెలలకోసారి దిశ కమిటీ భేటీ కావాలి. ఈమేరకు తొలి సమావేశం జరగాల్సి ఉన్నా.. ఉభయ జిల్లాల్లో తేదీలు ఖరారు కాలేదు. ఫలితంగా కేంద్ర ప్రభుత్వ పథకాల పురోగతిపై స్పష్టత కొరవడింది.

సుమారు 45 పథకాలపై సమీక్ష అవసరం

ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద పల్లెల్లో అనుసంధాన రహదారులు నిర్మించాల్సి ఉంది. ఈమేరకు దిశ కమిటీ సమావేశంలో ప్రతిపాదనలు రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి నివేదించాలి. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న రహదారులపైనా సమీక్షించాలి. ఇప్పటికే చాలా పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రధానమంత్రి గ్రామీణ ఆవాస్ యోజన కింద ఇళ్లు లేని నిరుపేదలకు నివాసయోగ్యం కల్పించాలి. ఉభయ జిల్లాల్లో వేలాది మంది సొంతింటి కల సాకారం కోసం ఎదురుచూస్తున్నారు. జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులపైనా సమీక్షించి సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేయాల్సి ఉంటుంది. బ్యాంకుల రుణ లక్ష్యాలు, రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులపైనా చర్చించాలి. ఆయుష్మాన్ భారత్ వంటి పథకాల కార్యాచరణపైనా సమీక్షించాలి. మొత్తం దాదాపు 45 ప్రభుత్వ పథకాలపై చర్చించాల్సి ఉంటుంది. ఈ పథకాలన్నీ సక్రమంగా అమలుకావాలంటే.. అవసరమైన నిధులు కేటాయించాలి. దిశ కమిటీ సమావేశం నిర్వహించి ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు రూపొందించి కేంద్రానికి నివేదించాలి.

సభ్యుల నియామకాలేవీ..?

ఖమ్మం జిల్లా దిశ కమిటీ ఛైర్మన్‌గా రామసహాయం రఘురాంరెడ్డి, భద్రాద్రి జిల్లా దిశ కమిటీ ఛైర్మన్‌గా పోరిక బలరాంనాయక్ వ్యవహరిస్తారు. కార్యదర్శులుగా సంబంధిత జిల్లాల కలెక్టర్లు ఉంటారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు ప్రత్యేక ఆహ్వానితులుగా కొనసాగుతారు. గతంలో లేని విధంగా ఇక నుంచి ఎమ్మెల్సీలను ఆహ్వానించాలనే ఆదేశాలందాయి. డీఆర్డీఏ, నగర మేయర్, పురపాలిక ఛైర్మన్లు, ఎంపీపీలు సభ్యులుగా ఉంటారు. అయితే ఎంపీపీల పదవీకాలం ఇప్పటికే ముగిసింది. మరో తొమ్మిది మందిని దిశ కమిటీ సభ్యులుగా ఎంపీలు నామినేట్ చేయాలి. వీరిలో ప్రజాసేవ చేసే నలుగురు ఎన్జీవో సభ్యులుండాలి. ఇప్పటి వరకు సభ్యులను ఎంపీలు నామినేట్ చేయలేదు. గత ఐదేళ్ల వ్యవధిలో కొవిడ్ సమయంలో రెండేళ్లపాటు దిశ కమిటీ సమావేశాలు జరగలేదు. మిగతా సమయంలో కాసింత మెరుగ్గానే సాగాయి. ఈసారి అంతకన్నా బాగా జరగాలంటే ఇద్దరు ఎంపీలు చొరవ చూపాలి. ఛైర్మన్లుగా ఉన్న ఎంపీలకు సమాచారమందించి త్వరలోనే సమావేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని డీఆర్డీఏ అధికారులు 'ఈనాడు'కు తెలిపారు.

మిల్లుల్లో ధాన్యం మాయం

☆ టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీల్లో వెల్లడి

ఖమ్మం నగరం, కొణిజర్ల, న్యూస్‌టుడే


కొణిజర్ల మండలంలోని ఓ మిల్లులో తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని పలు రైస్ మిల్లుల్లో హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందాలు మూడు రోజులుగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. అధికారుల తనిఖీల్లో విస్తుపోయే నిజాలు బయటపడుతున్నాయని తెలిసింది. గతేడాది ఖరీఫ్ సీజన్‌లో మిల్లర్లకు ప్రభుత్వం అప్పగించిన ధాన్యం మరపట్టి బియ్యం ఇవ్వాల్సి ఉండగా చాలా మిల్లుల నిర్వాహకులు బియ్యం అప్పగించలేదు. అందుకు తగిన ధాన్యం మిల్లుల్లో నిల్వ ఉండాల్సి ఉండగా అధికారుల తనిఖీల్లో కనిపించలేదు. మిల్లర్లు ప్రభుత్వం నుంచి ధాన్యం తీసుకుని మర పట్టి బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లో అమ్మేసుకుని ప్రభుత్వానికి ఎగ్గొట్టినట్లు తేటతెల్లమైంది. ఒక్కో మిల్లులో లెక్కలు తేల్చేందుకు అధికారులకు రెండు, మూడు రోజుల సమయం పడుతోంది. ధాన్యం మాయం చేసిన మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

☆ కొణిజర్ల మండలంలోని ఎస్ఏఆర్ రైస్ మిల్లులో రెండు రోజులుగా టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. విలేకరులతో డీఎస్ఓ చందన్‌కుమార్, డీఎం శ్రీలత బుధవారం మాట్లాడారు. గత రబీ, ఖరీఫ్‌కు సంబంధించి 3,50,622.65 క్వింటాళ్ల ధాన్యాన్ని మిల్లుకు సరఫరా చేయగా తనిఖీల్లో 99,122.68 క్వింటాళ్ల ధాన్యం తక్కువగా ఉన్నట్లు తేలిందన్నారు. మిల్లు యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేసేందుకు నివేదిక పంపనున్నట్లు వెల్లడించారు. తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు కమలాకర్, పుల్లయ్య, స్వామిదాస్, డీటీలు విజయ్‌బాబు, రామచంద్రరావు, మదన్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. 'మిల్లు సామర్థ్యానికి మించి మూడురెట్లు ధాన్యాన్ని పంపించారు. తడిసిన, ఇతర రాష్ట్రాల ధాన్యం పంపించడం వల్ల 40 శాతం వరకు పాడైపోయింది. వ్యత్యాసానికి సంబంధించిన మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లిస్తాం' అని మిల్లు నిర్వాహకుడు బాలకృష్ణ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

☆ పినపాక నియోజకవర్గంలోని ఓ మిల్లులో టాస్క్‌ఫోర్స్ అధికారులు రూ.2.50 కోట్ల విలువైన ధాన్యం నిల్వలు తగ్గినట్లు గుర్తించి, యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

☆ ఖమ్మం జిల్లాలో గత ఖరీఫ్, రబీ సీజన్లలో మిల్లర్లకు ధాన్యం కేటాయించే సమయంలో మిల్లు యజమానుల నుంచి ఒప్పంద పత్రం రాయించుకోవాల్సి ఉండగా కొందరు మిల్లర్ల నుంచి అగ్రిమెంట్స్ లేకుండానే ధాన్యం కేటాయించినట్లు తెలుస్తోంది.

ఖమ్మంలో ఓ ప్రముఖుడికి చెందిన మిల్లులోనూ ధాన్యం లెక్కలు తేలడం లేదని అధికారులు చెబుతున్నారు. ఖమ్మం రూరల్, నేలకొండపల్లి, పెనుబల్లి మండలాల్లోని మరికొన్ని మిల్లుల్లోనూ గతేడాది ఖరీఫ్ ధాన్యం నిల్వలు తక్కువగా ఉన్నట్లు జిల్లా అధికారులు గతంలోనే గుర్తించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన టాస్క్‌ఫోర్స్ అధికారులు మిగతా మిల్లుల్లోనూ వరుసగా తనిఖీలు నిర్వహించనున్నట్లు సమాచారం. సీఎంఆర్ బియ్యం ప్రభుత్వానికి అప్పగించేందుకు తమకు గడువు ఇవ్వాలని కోరుతూ కొందరు మిల్లర్లు కోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. మిల్లుల దగ్గర ధాన్యం నిల్వలుంటే సంబంధిత అధికారులే గడువు ఇచ్చేవారు. ధాన్యం నిల్వలు లేనపుడు మిల్లర్లు బియ్యాన్ని ఎలా ఇస్తారని పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రశ్నిస్తున్నారు.

మరో ఎన్నికకు రంగం సిద్ధం



ఈనాడు డిజిటల్, కొత్తగూడెం, న్యూస్‌టుడే, కొత్తగూడెం కలెక్టరేట్: మరో ఎన్నికకు రంగం సిద్ధమవుతోంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఓటరు జాబితా రూపొందించేందుకు ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పదవీ కాలం 2025 మార్చి 29 నాటికి ముగియనుంది. తదుపరి ఎన్నిక కోసం ఓటరు నమోదుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవల షెడ్యూల్ విడుదల చేసింది. ఈనెల 30 నుంచి దరఖాస్తుల ప్రక్రియ మొదలుకానుంది.

ఓటరు నమోదుకు ఎవరు అర్హులు..?

ఈ ఏడాది నవంబర్ 1 నాటికి గడిచిన ఆరేళ్లలో కనీసం మూడేళ్ల పాటు ఉన్నత పాఠశాలలు లేదా ఆపై విద్యాసంస్థల్లో బోధనానుభవం కలిగిన ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చు. సంబంధిత నియోజకవర్గ పరిధిలో సాధారణ నివాసిగా ఉండాలి.

రెండు విధాలుగా ఓటు నమోదు

రెండు విధాలుగా ఓటు నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఫాం-19 ద్వారా లేదా వెబ్‌సైట్ ceotelangana.nic.in లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఓటరు నమోదుకు నవంబరు 6 వరకు గడువు ఉంది. నవంబరు 23న ముసాయిదా ఓటరు జాబితాను అధికారులు ప్రకటిస్తారు. అనంతరం ఆ జాబితాపై డిసెంబరు 9 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. వాటిని డిసెంబరు 25 వరకు పరిష్కరించి అదేనెల 30న ఓటరు తుది జాబితా వెల్లడిస్తారు. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గానికి 2019లో జరిగిన ఎన్నికల సమయంలో 20,585 మంది ఓటర్లుగా నమోదయ్యారు. ఈసారి ఆ సంఖ్య పెరగనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

ప్రతిసారీ దరఖాస్తు చేసుకోవాల్సిందే..

గతంలో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నాం కదా.. ఈసారి సైతం ఓటరు జాబితాలో పేరు ఉంటుందనుకుంటే పొరపాటే.. సాధారణ ఎన్నికల ఓటరు జాబితా మాదిరిగా ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితాను రూపొందించరనే విషయాన్ని గుర్తించాలి. ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితాను ప్రతిసారీ కొత్తగానే రూపొందిస్తారు. ఎన్నికల సంఘం ఓటుహక్కు నమోదుకు ఇచ్చిన గడువులోపు దరఖాస్తు చేసుకున్నవారే ఓటేసేందుకు అర్హులవుతారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో అర్హులైన ఉపాధ్యాయులు ఓటుహక్కుకు నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

అధికారులకు అందజేయాల్సినవి

2019లో జరిగిన ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల్లో ఖమ్మం జిల్లాలో 3,435 మంది ఓటర్లు నమోదవగా.. భద్రాద్రి జిల్లాలో 2,502 మంది ఓటుహక్కు కలిగి ఉన్నారు. అత్యధికంగా ఖమ్మం నగర పరిధిలో 2,073 మంది, భద్రాద్రి జిల్లాలోని పాల్వంచలో 268 మంది ఉపాధ్యాయులు ఓటుహక్కు నమోదు చేసుకున్నారు. శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో ఓటుహక్కు లేకపోయినా అన్ని అర్హతలు ఉంటే ఈ ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. ఫాం-19తో పాటు ఫొటో, సర్వీసు ధ్రువపత్రం, ఆధార్, ఓటరు కార్డులను ఎన్నికల సంఘం సూచించిన అధికారులకు అందజేయాలి.

ఆస్పత్రిలో సదుపాయాల కల్పనపై ప్రతిపాదనలు రూపొందించండి


వైద్యాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం సర్వజనాసుపత్రిలో సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ వైద్యాధికారులను ఆదేశించారు. ఆసుపత్రిని బుధవారం తనిఖీ చేశారు. క్యాజువాలిటీ, ఏఎంసీ, జనరల్ వార్డులు, వెయిటింగ్ గది, ఐసీయూ, ఫార్మసీ, ఓపీ, ఫిజియోథెరపీ విభాగాలను పరిశీలించారు. రోగులు, సహాయకులతో మాట్లాడి చికిత్సలు, మందుల పంపిణీపై ఆరా తీశారు. తిరిగి వెళ్లే సమయంలో కారు వద్ద కనిపించిన ఓ చిన్నారిని ఆప్యాయంగా పలకరించారు. ప్రిన్సిపల్ రాజేశ్వరరావు, మెడికల్ సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్, సీఎస్ ఆర్ఎంఓ కళావతిబాయి, సీఏఎస్ ఆర్ఎంఓ రాంబాబు పాల్గొన్నారు.

పట్టణాల్లో పారిశుద్ధ్యం మెరుగుపడాలి

ఖమ్మం నగరం: ఖమ్మం నగర పాలక సంస్థ సహా జిల్లాలోని పట్టణాలు, మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్యం మెరుగుపడాలని, డంపింగ్ యార్డులకు సిమెంటు రోడ్లు నిర్మించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో మాట్లాడారు. అదనపు కలెక్టర్ పొడిశెట్టి శ్రీజ, మున్సిపల్ కమిషనర్లు రవిబాబు, అహ్మద్ షఫీఉల్లా, వేణు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాము తనిఖీ: కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదామును కలెక్టర్ తనిఖీ చేశారు. అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఎన్నికల డీటీ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

☆ చింతకాని మండలం కొదుమూరు, బస్వాపురం, కొణిజర్ల మండలం మునగాల, గోపతి, వైరా మండలం సిరిపురం, సోమవరం, పెనుబల్లి మండలం చింతగూడెం గ్రామాల భూనిర్వాసిత రైతులతో కలెక్టరేట్‌లో సంధి సమావేశం నిర్వహించారు. నష్ట పరిహారంపై చర్చించారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోండి: సీపీ

ఖమ్మం నేరవిభాగం: వివిధ కేసుల్లో బాధితులకు న్యాయం జరగాలంటే సరైన ఆధారాలు, నేర దర్యాప్తు కీలకమని సీపీ సునీల్‌దత్ అన్నారు. 'జిల్లాస్థాయి పోలీస్ డ్యూటీ మీట్'ను పోలీసు శిక్షణ కేంద్రంలో బుధవారం ప్రారంభించారు. కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్, హ్యాండ్లింగ్, లిఫ్టింగ్, ప్యాకింగ్ విభాగంలో, బాంబు డిస్పోజల్ స్క్వాడ్, పోలీసు జాగిలాల విభాగంలో ట్రాకింగ్, ఎక్స్‌ప్లోజివ్ విభాగాల్లో పోటీలు, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ నిర్వహించారు. సాంకేతిక పరిజ్ఞానం, కేసుల దర్యాప్తులో మెలకువలు నేర్చుకునేందుకు డ్యూటీ మీట్ ఉపయోగపడుతుందన్నారు. పోలీసు నైపుణ్యాలను ప్రదర్శించడానికి, ఆలోచనల మార్పిడికి, సంక్లిష్టమైన కేసుల పరిష్కారానికి దీన్ని అవకాశంగా ఉపయోగించుకొని ఉత్తమ ప్రతిభ చూపాలన్నారు. అదనపు డీసీపీ నరేశ్‌కుమార్, ఏసీపీలు రవి, సాంబరాజు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ ఎస్సైల రాక.. రాష్ట్ర పోలీసు అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న సబ్‌ఇన్‌స్పెక్టర్ అభ్యర్థులను పోలీసు శాఖ వివిధ జిల్లాలకు కేటాయించింది. ఖమ్మం కమిషనరేట్‌కు కేటాయించిన 15 మందిలో ఐదుగురు సబ్ ఇన్‌స్పెక్టర్లు(సివిల్) సీపీని బుధవారం కలిసి రిపోర్ట్ చేశారు.


సీపీ సునీల్‌దత్‌కు మొక్క అందజేస్తున్న శిక్షణ ఎస్సైలు


పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, రైతులు

అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు మేలు

వైరా, న్యూస్‌టుడే: అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు ప్రయోజనకరమని మధ్య తెలంగాణ మండలం సహ పరిశోధన వ్యవసాయ సంచాలకుడు ఆర్.ఉమారెడ్డి అన్నారు. వైరా కేవీకేలో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుపైన కార్యశాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సైంటిస్ట్(అగ్రనమి) యు.నాగభూషణం పత్తిలో కలుపు యాజమాన్యం గురించి తెలియజేశారు. ప్రిన్సిపల్ సైంటిస్ట్(పత్తి) జి.వీరన్న పత్తి సాగులో పాటించాల్సిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ జె.హేమంత్‌కుమార్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె.రవికుమార్, మధిర పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త కె.రుక్మిణీదేవి, ఉద్యాన శాస్త్రవేత్త వి.చైతన్య, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జెస్సి సునీత, విస్తరణ శాస్త్రవేత్త పి.ఎస్.ఎం.ఫణిశ్రీ పాల్గొన్నారు.

వరద బాధితులకు ధ్రువపత్రాల జారీకి ఏర్పాట్లు

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పొడిశెట్టి శ్రీజ


మాట్లాడుతున్న శ్రీజ

ఖమ్మం నగరం: జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పదోతరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ సహా ఇతరత్రా విద్యా సంబంధిత ధ్రువపత్రాలు కోల్పోయిన బాధితులకు తిరిగి ఇచ్చేందుకు ఆయా సంస్థల ఉన్నతాధికారులతో కలెక్టర్ సంప్రదింపులు జరుపుతున్నారని అదనపు కలెక్టర్ పి.శ్రీజ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం మాట్లాడారు. రెవెన్యూ సంబంధిత కుల, ఆదాయ, నివాస, పట్టాదారు పాసుపుస్తకాలు తదితర ధ్రువపత్రాలకు ఆయా మండలాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని వివరించారు. ప్రత్యేక క్యాంపుల్లో మీసేవ కేంద్రం ఏర్పాటు చేసి రుసుము లేకుండా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

☆ జిల్లాలోని 237 ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు ఆత్మరక్షణ(సెల్ఫ్ డిఫెన్స్)లో శిక్షణ అందించేందుకు వారానికి 3 రోజులు తరగతులు నిర్వహించనున్నట్లు శ్రీజ తెలిపారు. 120 మంది శిక్షకులను తాత్కాలిక పద్ధతిలో నియమిస్తామని చెప్పారు. ప్రతి బుధవారం జిల్లాస్థాయి అధికారులు సుమారు 70 మంది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసేందుకు కలెక్టర్ ప్రత్యేక కార్యక్రమం రూపొందించినట్లు తెలిపారు. భోజనం నాణ్యత, పరిసరాల పరిశుభ్రత, విద్యార్థుల అవసరాలు గుర్తిస్తారని తెలిపారు. 50 పాఠశాలల్లో ఇంగ్లిష్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశామని, విద్యార్థులకు ఆడియో, వీడియోల ద్వారా ఆంగ్లంలో మాట్లాడటంలో శిక్షణ ఇస్తారని తెలిపారు. డీఈఓ సోమశేఖర శర్మ పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకల్లో 1098పై అవగాహన: అక్టోబర్ 2 నుంచి బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు శ్రీజ తెలిపారు. కలెక్టరేట్, సర్దార్ పటేల్ స్టేడియం సహా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వేడుకలు జరిపేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 10న ఇంటర్నేషనల్ గర్ల్ చైల్డ్‌డే సందర్భంగా బాలల హక్కులు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. టోల్‌ఫ్రీ నంబర్1098పై అవగాహన పెంపొందించాలని నిర్ణయించినట్లువెల్లడించారు.

ప్రకాశ్‌నగర్ వంతెన మీదుగా
ద్విచక్ర వాహనాలకు అనుమతి

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: మున్నేరు వరద ఉద్ధృతికి స్పాన్‌లు పక్కకు జరిగిన ప్రకాశ్‌నగర్ వంతెనపై రాకపోకలు నిలిపివేసిన విషయం విదితమే. నగరంలోకి వచ్చిపోయే ద్విచక్ర వాహనదారులు చుట్టూ తిరిగి రావాల్సి రావడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి ద్విచక్ర వాహనాల రాకపోకలను అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఆయన అధికారులను ఆదేశించారు. నీటి పారుదలశాఖ ఈఈ నుంచి అనుమతి తీసుకుని ద్విచక్రవాహనాల రాకపోకలను బుధవారం నుంచి అనుమతిస్తున్నామని ఖమ్మం ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు తెలిపారు. వంతెన వద్ద 24 గంటలు నిఘా ఉండేలా బందోబస్తు చేపట్టామన్నారు. ఏర్పాట్లను అదనపు డీసీపీ ప్రసాద్‌రావు పరిశీలించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.


వంతెనపై రాకపోకలను పరిశీలిస్తున్న ఏసీపీ శ్రీనివాసులు

యూటీ తొలగింపుతో పొంచి ఉన్న ముప్పు..!

కూసుమంచి, న్యూస్‌టుడే

పాలేరు జలాశయానికి దిగువన సాగర్ ఎడమ కాల్వ అండర్ టన్నెల్ (యూటీ)ని పునర్నిర్మించలేదు. మంగళవారం రాత్రి కురిసిన వర్షం నీరు.. యూటీని తొలగించిన స్థానంలో నిలిచిపోయింది. ప్రవహించేందుకు మార్గం లేకపోవడంతో పక్కనే ఉన్న రైతుల పొలాల్లోకి చేరింది. సుమారు నాలుగెకరాల పంటలు జలమయమయ్యాయి.

2,085 క్యూసెక్కుల ప్రవాహ అంచనాతో యూటీ నిర్మాణం: పాలేరు జలాశయం దిగువన సాగర్ ఎడమ కాల్వకు 140.560 కిలోమీటరు వద్ద యూటీ నిర్మించారు. సాగర్ ఎడమ కాల్వకు అడుగున ఉండే దీనిద్వారా పాలేరు గ్రామ పరిసరాల్లోని వందలాది ఎకరాల్లో కురిసిన వర్షం నీరు, జుజ్జులరావుపేట చెరువు అలుగు నీరు ప్రవహించి పాలేరు ఏటిలో కలుస్తాయి. 2,085 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో రెండు ఖానాలతో యూటీ ఉండేది.


తొలగించిన యూటీ వద్ద నిలిచిన నీటిని కాల్వలోకి తోడేందుకు ఏర్పాటు చేసిన మోటార్లు

వరద ధాటికి ధ్వంసమవటంతో తొలగింపు..

ఇటీవల వరద ధాటికి యూటీ ధ్వంసమైంది. అధికారులు గుర్తించి యూటీని తొలగించి ఒక్కో మీటరు వ్యాసార్ధం, 2.50మీ పొడవైన 70 పైపులు సమకూర్చారు. వాటిని రెండు వరుసలుగా పేర్చి కాంక్రిట్ వేసి కట్టలు పటిష్ఠపరచాలని నిర్ణయించారు. ప్రభుత్వ పెద్దల సూచనలతో పైపుల ప్రతిపాదనను పక్కనబెట్టి యూటీ ప్రాంతంలోనూ పూర్తిగా కట్ట నిర్మించి నీటిని విడుదల చేశారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

యూటీని తొలగించి కాల్వకు నీటిని విడుదల చేసిన మంగళవారం రాత్రే ఈప్రాంతంలో భారీ వర్షం కురిసింది. పాలేరు గ్రామ పరిసరాల్లో కురిసిన వర్షం నీరు సాగర్ ఎడమ కాల్వ కింది నుంచి ప్రవహించే అవకాశం లేకుండా పోయింది. తొలగించిన యూటీ కట్టడం ప్రాంతంలోనే నిలిచిపోయింది. కలెక్టర్ ఆదేశంతో నీటిని తోడేందుకు భారీ మోటార్లు మూడింటిని అధికారులు సమకూర్చారు. వీటిలో రెండు నడుస్తున్నాయి. ఇంకోదాన్ని నడిపించాల్సి ఉంది. ప్రత్యామ్నాయంగా నీటిని జుజ్జులరావుపేటలో జాతీయ రహదారి కింది నుంచి మల్లాయిగూడెంలో ఉన్న మరో యూటీ వరకు తరలించాలని నిర్ణయించి కాల్వ తవ్వకం పనులు చేపట్టారు. అడపాదడపా కురిసే వర్షాలతో ప్రమాదం లేకున్నా.. భారీ వర్షాలు కురిసి వరద పోటెత్తితే యూటీ తొలగించిన ప్రాంతంలో పరిస్థితి అదుపు తప్పే సంకేతాలు కనిపిస్తున్నాయి. తొలగించిన యూటీ ప్రాంతంలో ఎలాంటి ప్రమాదం జరగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టామని జలవనరులశాఖ సీఈ విద్యాసాగర్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

పట్టాల వెంట.. పచ్చందాల పరుగు!



చుట్టూ పచ్చందాలు, దూరాన కొండల మధ్యలోంచి బీడీసీఆర్ (కొత్తగూడెం)-సత్తుపల్లి రైలుమార్గం వెళ్తోంది. సుజాతనగర్ మండలం వేపలగడ్డ వద్దనున్న ఆర్వోబీ పైనుంచి ఈ సుందర దృశ్యాన్ని వీక్షించేందుకు వాహనదారులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఉత్సాహంగా సెల్ఫీలు దిగుతున్నారు.
– కొత్తగూడెం సంక్షేమ విభాగం, న్యూస్‌టుడే

నింగీ నేల.. కలిసేలా జలకళ



కిన్నెరసాని రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి మట్టం 407 అడుగులకు చేరింది. ఎగువన కురిసిన వర్షాలకు ప్రస్తుతం పెద్దఎత్తున వరద వచ్చి చేరుతోంది. అధికారులు 7 వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టులోని జలకళను చూసేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు. నింగి, నేలను కలుపుతున్నట్లు కనిపించే జలాశయం అందరినీ ఆకట్టుకుంటోంది.
– పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే

వరదలకు చలించని వారధి



ఇటీవల వర్షాలతో పోటెత్తిన వరద ఉద్ధృతి దాటికి భారీ వంతెనలు సైతం గతి తప్పుతున్నాయి. కానీ కొన్ని ప్రాంతాల్లో ఏళ్ల క్రితం నిర్మించినవి పటిష్ఠంగా ఉంటూ అబ్బురపరుస్తున్నాయి. కొత్తగూడెం-విజయవాడ రహదారిలో రుద్రంపూర్ సమీపంలో రైల్వేలైను కింద నుంచి వెళ్లే వంతెన (అండర్ బ్రిడ్జి) ఈ కోవకే చెందుతుంది. దీన్ని బ్రిటీషు కాలంలో రాళ్లతో నిర్మించారు. రుద్రంపూర్‌తో పాటు జీఎం కార్యాలయం, పీవీకే-5 గని, మాయాబజార్, 4 ఇంక్లైన్ వెళ్లేందుకు దీని గుండానే రాకపోకలు సాగిస్తున్నారు.
– కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే

దివ్యాంగుల గోడు.. కల్పించాలి గూడు


రెండు కాళ్లు లేని కొణతం అమృతరావు

ఇన్‌ఫెక్షన్‌తో ఆయన రెండు కాళ్లు తీసేశారు. సోదరులిద్దరూ దివ్యాంగులు. అంతా ఒక్క ఇంట్లో తలదాచుకుంటున్నారు. తమకు ఇల్లు మంజూరు చేసి నీడ కల్పించాలని జిల్లా కలెక్టర్‌ను వేడుకుంటున్నారు. ఖమ్మం అర్బన్ మండలం గోపాలపురానికి చెందిన కొణతం అమృతరావు కుటుంబం నల్గొండ నుంచి వలస వచ్చింది. తండ్రి ఎన్నెస్పీలో ఫోర్‌మెన్‌గా పని చేసి మరణించారు. గతంలో ఎన్నెస్పీ క్యాంపులోని క్వార్టర్స్‌లో ఉండే వారు. ఏడేళ్ల కిందట క్వార్టర్స్ కూల్చివేయడంతో దిక్కుతోచని స్థితిలో గోపాలపురంలో అద్దె ఇంటిలో తలదాచుకుంటున్నారు. అమృతరావుకు గతంలో ఇన్‌ఫెక్షన్ సోకడంతో రెండు కాళ్లు తొలగించారు. చేతులు వంకర్లు పోయాయి. కొంతకాలం కిందట ఈయన భార్య చనిపోయింది. అన్న అనిల్‌కుమార్ మానసిక, తమ్ముడు కిరణ్ శారీరక దివ్యాంగులు. అంతా కలిసే ఉంటున్నారు. ఆసరా పింఛనుతో బతుకు వెల్లదీస్తున్నారు. తమకు రెండు పడక గదుల ఇల్లు మంజూరు చేయాలని కలెక్టర్‌ను వేడుకున్నారు.
– ఖమ్మం నగరం, న్యూస్‌టుడే

పరిశోధన స్థానాన్ని పరిశీలించిన ఏడీఆర్


పరిశోధన స్థానంలో పైర్లను పరిశీలిస్తున్న ఏడీఆర్ ఉమారెడ్డి

మధిర, న్యూస్‌టుడే: మధిర వ్యవసాయ పరిశోధన స్థానాన్ని వరంగల్‌కు చెందిన అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్(ఏడీఆర్) ఆర్.ఉమారెడ్డి బుధవారం పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ పరిశోధన స్థానంలో ప్రయోగాత్మకంగా సాగుచేస్తున్న పెసర, మినుము, వరి పంటలు ముంపునకు గురై దెబ్బతిన్నాయి. పెసర, మినుము, పూత, కాత దశలో ఉన్న సమయంలో వరద ఉద్ధృతికి పాడయ్యాయి. దీంతో ఆయన పరిశోధన స్థానానికి వచ్చి క్షేత్రస్థాయిలో వాటిని పరిశీలించి ప్రధాన శాస్త్రవేత్త రుక్మిణీదేవితో మాట్లాడి నష్టాన్ని అంచనా వేశారు. ఆయన వెంట పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ఉన్నారు.

కళ్లుగప్పి.. నల్లబంగారాన్ని కొల్లగొట్టి..


కోల్‌హ్యాండ్లింగ్ ప్లాంటులో లారీల్లో లోడవుతున్న బొగ్గు (పాత చిత్రం)

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే

ఎన్ని చర్యలు తీసుకుంటున్నా సింగరేణిలో బొగ్గు అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. అక్రమార్కులు దొడ్డిదారిన ఉత్పత్తిని తరలించేందుకు కొత్త మార్గాలను కనిపెడుతున్నారు. ఇటీవల భూపాలపల్లి నుంచి రామగుండం చేరాల్సిన బొగ్గును అక్రమ మార్గంలోకి మళ్లించిన విషయం వెలుగుచూసింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు.

సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల్లోని భూగర్భ, ఉపరితల గనుల నుంచి రోజుకు 1.7 లక్షల టన్నులకు పైగా బొగ్గును వెలికితీస్తుంటారు. దీన్ని గనుల నుంచి బంకర్లకు డంప్ చేసే క్రమంలో, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి అంతర్గతంగా తరలించేందుకు సుమారు వెయ్యి వరకు టిప్పర్లు, లారీలను వినియోగిస్తున్నారు. సాధారణంగా ఏదైనా వాహనం అనుమతించిన మార్గంలో కాకుండా ఇతర దారులకు వెళ్తే వెంటనే కొత్తగూడెంలోని సింగరేణి కార్పొరేట్ కార్యాలయ విజిలెన్స్ అధికారులకు సందేశం వస్తుంది. నిర్ణీత మార్గంలోనే వెళ్లేలా చూసేందుకు ఆయా వాహనాలకు గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం(జీపీఎస్)లను అమర్చారు. ఈ సాంకేతికత వ్యవస్థ ఉన్నా ఉత్పత్తిని అక్రమ మార్గంలో తరలిస్తున్నారని కొద్దిరోజుల క్రితం భూపాలపల్లి ఘటనతో అధికారులు గుర్తించారు.

పరికరాన్ని పట్టుకుంటే సందేశం వచ్చేలా..

వాహనానికి బిగించి ఉన్న జీపీఎస్ వ్యవస్థను విప్పితే వెంటనే విజిలెన్స్ కార్యాలయానికి సంక్షిప్త సందేశం అందేలా సాంకేతికతను అందుబాటులోకి తేవాలని సంస్థ నిర్ణయించింది. సంబంధిత విభాగం అధికారులను ఉన్నతాధికారులు అప్రమత్తం చేశారు. ఈ అంశంపై సంస్థలో భారీ కసరత్తు జరుగుతోందని తెలుస్తోంది. అధునాతన సాంకేతికతతో అక్రమాల్ని నిలువరిస్తామని సింగరేణికి చెందిన ఓ డైరెక్టర్ 'న్యూస్‌టుడే'తో పేర్కొన్నారు.

వ్యవస్థను మార్చి.. అధికారులను ఏమార్చి

వాహనాలకు బిగించిన జీపీఎస్ పరికరాన్ని లారీ సిబ్బంది తొలగిస్తున్నారు. దాన్ని వేరే వాహనంలో ఉంచి అనుమతించిన మార్గంలో పంపుతున్నారు. అక్కడ్నుంచి బొగ్గు లారీని ఇతర ప్రాంతానికి తరలించి కొంత మొత్తాన్ని దిగుమతి చేసి దండుకుంటున్నారు. భూపాలపల్లి ఉదంతంలో ఏకంగా 150 టన్నుల బొగ్గును అడవిలో డంప్ చేయడాన్ని గమనించిన సింగరేణి అధికారులు అవాక్కయ్యారు. భూపాలపల్లి ఏరియా తరహాలో ఈ రకమైన దందా ఇంకా ఇతర జిల్లాల్లోని ఏరియాల్లో ఎక్కడైనా జరుగుతుందా? అని స్థానిక అధికారులు వెంటనే సోదాలు చేపట్టారు. బొగ్గు చౌర్యానికి అవకాశాలున్న మార్గాల్లో తిరిగే వాహనాల జీపీఎస్‌లను తనిఖీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏ వాహనాన్నీ వదలకుండా నిఘా పటిష్ఠపరచాలని నిర్ణయించారు.

నేడు పెసల కొనుగోలు బంద్

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: జిల్లాలో వర్షాలు కురుస్తున్న కారణంగా గురువారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పెసల కొనుగోలు ఉందని మార్కెట్ కార్యదర్శి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 27న తిరిగి కొనుగోలు ప్రారంభిస్తామని, రైతులు గమనించాలని సూచించారు.

ముగిసిన సీబీఎస్ఈ క్లస్టర్ ఖోఖో టోర్నమెంట్

నిజాంపేట, న్యూస్‌టుడే: హైదరాబాద్ బాచుపల్లిలోని వీఆర్ఎస్ విజ్ఞాన జ్యోతి రెసిడెన్షియల్ పాఠశాలలో నాలుగు రోజులుగా జరిగిన సీబీఎస్ఈ క్లస్టర్ ఖోఖో టోర్నమెంట్ పోటీలు బుధవారం ముగిశాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 200 సీబీఎస్ఈ పాఠశాలల నుంచి 5,500 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. అండర్-14, 17, 19 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరు పోటీలు జరిగాయి. విజేతలుగా నిలిచిన 12 జట్లకు బుధవారం బహుమతుల ప్రదానం జరిగింది. అండర్-17 బాలుర విభాగంలో విజేతలుగా నిలిచిన వారిలో బ్లూమింగ్ మైన్స్ (ఖమ్మం), అండర్-19 బాలికల విభాగంలో హార్వెస్ట్ పాఠశాల (ఖమ్మం), బాలుర విభాగంలో డీపీఎస్ (ఖమ్మం) జట్లు ఉన్నాయి.

ఆగని ఆక్రమణల పర్వం

వైరా, న్యూస్‌టుడే: వైరాలోని శాంతినగర్ రైతువేదిక నుంచి అయ్యప్పక్షేత్రం వైపు ఎన్ఎస్పీ స్థలాల ఆక్రమణ పర్వం కొనసాగుతోంది. రెండు రోజులుగా స్థానికంగా ఉంటున్న పలువురు ఆక్రమించుకునే ప్రయత్నంలో హద్దులు వేసుకుంటున్నారు. దీంట్లో భాగంగా బుధవారం పలువురు ఎన్ఎస్పీ కాలువ తమదేనంటూ హద్దులు పాతడం విశేషం. ఆక్రమణలు తొలగించకపోతే చర్యలు తీసుకుంటామంటూ రెవెన్యూ అధికారులు బుధవారం సంఘటన స్థలంలో స్థానికులకు వివరించారు. ఆక్రమణలు తొలగించాలంటూ స్పష్టంగా సూచించారు. మధిర రోడ్డు నుంచి శాంతినగర్ వరకు ఎన్ఎస్పీ కాలువలపై గతంలో వేసిన ఇళ్లు వాటి వివరాలను అధికారులు సేకరించారు.

రాములోరికి ఘనంగా తిరుమంజనం



భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామిని బుధవారం తిరుమంజనం చేసి భజనలతో పూజించారు. అర్చకులు సుప్రభాతం పలికి ఆరాధించి నామార్చన నిర్వహించారు. క్షేత్ర విశిష్టతను ప్రవచనం చేసిన తీరు మంత్రముగ్ధులను చేసింది. నిత్యకల్యాణ క్రతువులో భాగంగా మాంగళ్యధారణ రమణీయమై కనిపించింది. తలంబ్రాల వేడుక అమితానందాన్ని అందించింది. దర్బారు సేవ తన్మయత్వాన్ని నింపింది. భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వైదిక పెద్దలు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీస్సులు పలికారు. 26న పునర్వసు పురస్కరించుకుని స్నపన తిరుమంజనం ఉంటుంది. 27న పుష్యమి సందర్భంగా సీతారామ పట్టాభిషేకం చేస్తారని వైదిక పెద్దలు తెలిపారు. ఇదే రోజున సంధ్యా హారతి అందిస్తారు.

టేబుల్ టెన్నిస్ జంబో జట్టు


టీటీ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: 'ఖమ్మంలో టేబుల్ టెన్నిసా' అనే విమర్శ నుంచి 'ఇంతమంది టీటీ క్రీడాకారులా' అనే దశకు వీరి సంఖ్య చేరింది. బుధవారం పటేల్ స్టేడియంలో అండర్ 19 టేబుల్ టెన్నిస్ బాల, బాలికల జట్ల ఎంపిక కోసం పోటీలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో క్రీడాకారులు తరలి వచ్చారు. స్టేడియంలోని శిక్షణ కేంద్రం అందుబాటులోకి వచ్చిన నాటి నుంచి ఈ సంఖ్య గణనీయంగా పెరిగింది. కేవలం సంఖ్య మాత్రమే కాకుండా గత ఏడాది జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్ 19 విభాగంలో రెండు రజత పతకాలు అందాయి. ఈసారి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తామని కోచ్ సాంబమూర్తి చెప్పారు. పోటీల ముగింపు కార్యక్రమంలో డీవైఎస్ఓ సునీల్‌రెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం అండర్ 19 కార్యదర్శి మూసా కలీం జిల్లా జట్టుకు ఎంపికైన వారి వివరాలను వెల్లడించారు. బాలుర జట్టులో పి.జ్వలిత్, ఎస్.రాధాకృష్ణ, మోహిత్, తరుణ్ ఉన్నారు. బాలికల జట్టులో అమృత, నవ్య, బి.కుమారి, సుప్రియ, చంద్రకారిణి తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా వెలిసిన గోడపత్రికలు



చర్ల, న్యూస్‌టుడే: చర్లతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో మావోయిస్టులకు వ్యతిరేకంగా బుధవారం రాత్రి గోడపత్రాలు వెలిశాయి. ఆదివాసీ హక్కుల సంఘం పేరిట వెలిసిన ఈ గోడపత్రాల్లో ఏం సాధించిందని మావోయిస్టు పార్టీ 20 ఏళ్ల సంబురాలు చేసుకుంటోందని ప్రశ్నించారు.

'ఎన్‌కౌంటర్ బూటకం'

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో ఈనెల 24 తేదీన జరిగిన ఎన్‌కౌంటర్ ఓ బూటకమని సీపీఐ మావోయిస్టు దక్షిణ బస్తర్ డివిజన్ కమిటీ కార్యదర్శి గంగ పేరున బుధవారం మీడియాకు ఓ లేఖ విడుదల చేశారు. చింతవాగు నదిలో చేపల వేటకు వెళ్లి నది ఒడ్డున నిద్రిస్తున్న గ్రామస్థులపై పోలీస్‌లు కాల్పులు జరిపారని ఆరోపించారు. ఆ సమయంలో కవాసి భీముడు తన ప్రాణాలను కాపాడుకోవడానికి పరిగెడుతుండగా కాల్చడంతో మృతి చెందాడని తెలిపారు. గ్రామస్థులు అతని మృతదేహాన్ని నదిలో నుంచి బయటకు తీశారని వెల్లడించారు. కవాసి బండి, మద్వి భీమాను బలవంతంగా భద్రతా బలగాలు అరెస్టు చేసి తీసుకెళ్లారని ఆరోపించారు. పోలీస్‌లు పట్టుకున్న వారిని రక్షించడానికి వెళ్లిన గ్రామస్థులపై దాడులు చేసి రూ.15 వేలు దోచుకున్నారని లేఖలో ఆరోపించారు.

ట్రాక్టర్ బోల్తా.. యువకుడి దుర్మరణం


వెంకటేశ్వరరావు

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు మృతిచెందిన ఘటన అశ్వారావుపేట మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై యయాతి రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం కామయ్యపాలేనికి చెందిన కొత్తపల్లి వెంకటేశ్వరరావు(22) ట్రాక్టర్ డ్రైవర్. అశ్వారావుపేట మండలం పాపిడిగూడెం నుంచి పామాయిల్ గెలలను ట్రాక్టరులో అశ్వారావుపేట ఫ్యాక్టరీకి బుధవారం తరలిస్తున్నాడు. మార్గం మధ్యలో సత్తెమ్మ ఆలయం వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. వెంకటేశ్వరరావు మీదుగా ట్రక్కు టైరు ఎక్కడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి వరలక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్లు చెప్పారు.

రైలు నుంచి జారిపడి ఒకరి మృతి

చింతకాని, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చింతకాని మండలం పందిళ్లపల్లి రైలు నిలయం సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. మృతుడి వయసు 40 సంవత్సరాలు ఉండవచ్చని రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు. అన్నం సేవాసమితి సభ్యులు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి పట్టివేత


గంజాయి, నిందితుడిని చూపిస్తున్న ఏఈఎస్ వేణుగోపాల్‌రెడ్డి

ఖమ్మం సారథినగర్, న్యూస్‌టుడే: ఆబ్కారీ టాస్క్‌ఫోర్స్ బృందం బుధవారం 24.35 కిలోల గంజాయి పట్టుకొంది. సహాయ అధికారి వేణుగోపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... టాస్క్‌ఫోర్స్ బృందం నగరంలోని శ్రీశ్రీ సర్కిల్ నుంచి బస్టాండు వరకు తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా ఉన్న ఓ వ్యక్తి వద్ద ఉన్న మూటలు పరిశీలించగా అందులో గంజాయి ఉంది. నిందితుడిపై కేసు నమోదు చేశారు. తనిఖీ బృందంలో సి.ఐ. కరుణశ్రీ, ఎస్సై సరిత సిబ్బంది ఉన్నారు.

మణుగూరు సాంస్కృతికం: ద్విచక్ర వాహనాలపై గంజాయిని తరలిస్తున్న వ్యక్తులను మణుగూరు సమీపంలో బుధవారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు అరెస్టు చేశారు. అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ తిరుపతి వివరాల ప్రకారం.. సీలేరు నుంచి ఐదుగురు వ్యక్తులు గంజాయిని తీసుకువస్తున్నారన్న విశ్వసనీయ సమాచారంతో మణుగూరులోని అర్బన్ పార్క్ వద్ద తనిఖీలు చేపట్టారు. రెండు ద్విచక్ర వాహనాలపై నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించగా వారిని తనిఖీ చేశారు. దీంతో సుమారు రూ.4 లక్షల విలువైన 12.5 కిలోల గంజాయి లభ్యమైంది. పట్టుబడిన మహబూబాబాద్, జనగాంలకు చెందిన రేగు సంపత్, గందమల్ల లవ్‌కుమార్, బందెల సాయికుమార్, బోడ వంశీలతోపాటు పరారీలో ఉన్న మరో వ్యక్తి జానీ మొత్తం ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ రమేష్, హెడ్‌కానిస్టేబుల్ కరీం, కానిస్టేబుళ్లు హరీష్, సుధీర్, వెంకట్, హనుమంతరావు, విజయ్ పాల్గొన్నారు.

హైడ్రోజన్ సల్ఫైడ్ విష వాయువు వాసన

◆ ఇబ్బందులు పడ్డ కుమ్మరిగూడెం ప్రజలు

అశ్వాపురం, న్యూస్‌టుడే: కుమ్మరిగూడెం గ్రామ ప్రజలు మంగళవారం అర్ధరాత్రి స్థానిక భారజల ప్లాంటులో భారజలం ఉత్పత్తికి వినియోగించే హైడ్రోజన్ సల్ఫైడ్ విషవాయువు విడుదలైనప్పుడు వచ్చే కుళ్లిన కోడిగుడ్ల వాసనతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సరిగ్గా రాత్రి 11 గంటలకు వాసన రావడం మొదలైంది. సుమారు 45 నిమిషాల వరకు వచ్చింది. అదృష్టవశాత్తు ఎవరూ అస్వస్థతకు గురికాలేదు. విషవాయువు ఏమైనా లీకై ఉంటుందా? అనే విషయం తెలియడం లేదు. ఎవరూ నిర్ధారించడం లేదు. కానీ లీకై ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. విషయం తెలిసి మండల పరిషత్, రెవెన్యూ అధికారులు బుధవారం కుమ్మరిగూడెం గ్రామం సందర్శించారు. గ్రామ ప్రజలు వారికి విషయం వివరిస్తూ సంతకాలతో కూడిన వినతిపత్రాలు సమర్పించారు. భవిష్యత్తులో ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

★ భారజల ప్లాంట్ జీఎం ఎస్.జగ్గారావును ఈ విషయమై 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. విష వాయువు వాసనతో కుమ్మరిగూడెం గ్రామ ప్రజలు ఇబ్బందులు పడిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. పరిశీలన జరుపుతున్నామని చెప్పారు. ఆ రాత్రే తమ అధికారులు కుమ్మరిగూడెం గ్రామం సందర్శించి పరిశీలన జరిపి వచ్చారన్నారు. ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు గ్రామ ప్రజలు వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు. త్వరలోనే కుమ్మరిగూడెం గ్రామంలో దీనిపై అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తామన్నారు.

దేవీ నవరాత్రులకు ఏర్పాట్లు


శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవాల గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న సహాయ కమిషనర్, ఈఓ, ధర్మకర్తలు

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అక్టోబరు 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఈఓ జగన్మోహన్‌రావు, ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో బుధవారం దేవాదాయశాఖ సహాయ కమిషనర్ ఎం.వీరాస్వామి ఆధ్వర్యంలో శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవాల గోడపత్రికలు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.29 లక్షలు

జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం బుధవారం లెక్కించారు. దేవాదాయశాఖ సహాయ కమిషనర్ ఎం.వీరాస్వామి పర్యవేక్షణలో జరిగిన లెక్కింపులో 91 రోజులకు రూ.29,51,477 వచ్చినట్లు ఈఓ జగన్మోహన్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, పర్యవేక్షకురాలు కె.విజయకుమారి, ఆలయ అర్చకులు, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

సత్తుపల్లి, న్యూస్‌టుడే: స్థానిక ఠాణాలో బుధవారం రాత్రి పోక్సో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. సత్తుపల్లికి చెందిన ఓ బాలికతో బాబాయి వరుస అయ్యే షేక్ పాషామియా అనే వ్యక్తి బుధవారం సాయంత్రం అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయమై బాధిత కుటుంబ సభ్యులు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాషామియాపై పోక్సో కేసు నమోదు చేశారు. నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపర్చడంతో రిమాండ్ విధించారు.

చేతులెత్తి మొక్కుతున్నా.. చేయూతనివ్వరూ!

మానవీయం

సత్తుపల్లి, న్యూస్‌టుడే

ఇంటి పెద్ద కొవిడ్‌తో మృతిచెందగా ఇల్లాలు అనారోగ్యంతో మంచాన పడింది. గ్రామస్థులకు ఆరోగ్య రక్షణ కోసం పనిచేసిన ఆమె ఇప్పుడు విషమ పరిస్థితిలో ఉన్నారు. నెలనెలా అయ్యే మందుల ఖర్చులకూ డబ్బుల్లేక ఆ పేద కుటుంబం ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తోంది.

సుమారు నాలుగు నెలలుగా

సత్తుపల్లి అంబేడ్కర్‌నగర్‌లో చల్లపల్లి సుగుణరావు, సుజాత దంపతులు నివాసం ఉండేవారు. వీరికి కుమార్తె శ్రుతి, కుమారుడు శాంతకుమార్ సంతానం. సుగుణరావు ఆటో నడుపుతుండగా సుజాత కాకర్లపల్లి రోడ్డు పరిధిలో ఆశా కార్యకర్తగా పనిచేసేవారు. 2020లో కొవిడ్‌తో సుగుణరావు మృతిచెందడంతో ఆ కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది. పిల్లలను సుజాత చదివించుకుంటూ వస్తున్నారు. ఆమె కూడా అనారోగ్యానికి గురవగా హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మెదడులోని నరాల ఇన్‌ఫెక్షన్‌తో సుజాత బాధపడుతున్నట్లు తేలింది. శస్త్రచికిత్సకు ఆరోగ్యశ్రీ వర్తించకపోవటంతో రూ.5లక్షల వరకు బయట అప్పులు చేసి ఆపరేషన్ చేయించుకున్నారు. అప్పట్లో మందులు, ఇంజెక్షన్లు అధిక మోతాదులో వాడటంతో తొంటి జాయింట్ ఎముకల్లో రక్తం సరఫరా కాక ఎముక దెబ్బతినడంతో శస్త్రచికిత్స చేసి స్టీల్ రాడ్ వేశారు. ఫలితంగా మరో ఆరు నెలల వరకు విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చింది. అప్పటి నుంచి ఆమె మంచానికే పరిమితమై ఇంట్లో గడవక, మందులకు డబ్బులు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా నెలకోసారి రూ.40వేలు, రూ.45వేల విలువైన రెండు ఇంజెక్షన్లను నాలుగు నెలలపాటు చేయించుకోవాల్సి రావడంతో నానా తంటాలు ఎదుర్కొంటున్నారు. నెలనెలా రూ.4వేలు మందులు, ఇంజెక్షన్లు చేయించుకునేందుకు దాతల నుంచి ఆమె సాయాన్ని అర్థిస్తున్నారు.


మంచానికి పరిమితమైన చల్లపల్లి సుజాత

దాతలు సంప్రదించాల్సిన నంబర్: 93944 50050

చికెన్ ధరలు



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 రిటైల్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ధరలు (రూ.లలో)

పంట పేరు	కనిష్ఠ	గరిష్ఠ	నమూనా
పత్తి	5,800	7,211	7,000
పెసలు	4,000	7,200	7,500
ఏసీ ఎండుమిరప	10,300	20,000	17,000
ఎండుమిరప	10,000	17,000	15,500
ఏసీ తాలుమిరప	8,500	9,400	9,000

సత్తుపల్లి

•సత్తుపల్లి •మధిర •వైరా

రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపిక


చాతుర్య

మధిర గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని దెందుకూరుకు చెందిన యడ్లపల్లి చాతుర్య స్కేటింగ్ పోటీల్లో జిల్లాస్థాయిలో సత్తా చాటి రెండు బంగారు పతకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. 6వ తరగతి చదువుతున్న ఈమె జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిందని తల్లిదండ్రులు శ్రీనివాసరావు, సుప్రజ తెలిపారు.

దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్ మేళా

పెనుబల్లి, న్యూస్‌టుడే: వీఎం బంజర్‌లోని శ్రీరాజసాయి మందిరంలో ఈ నెల 26న దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్ మేళా నిర్వహించనున్నట్లు ఆర్టీసీ డీఎం రాజ్యలక్ష్మి తెలిపారు. దివ్యాంగులు చెల్లించాల్సిన 50 శాతాన్ని శ్రీరాజసాయి మందిరం నిర్వాహకులు జిన్నా రెడ్డి నరసింహారెడ్డి సమకూర్చి ఉచితంగా బస్‌పాస్ అందించనున్నట్లు తెలిపారు.

'ఎత్తిపోతలను పునరుద్ధరించాలి'

కల్లూరు, న్యూస్‌టుడే: బత్తులపల్లి ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించి పంటలకు నీరందించాలని కోరుతూ ఆయకట్టు రైతులు ఎన్నెస్పీ ఎస్ఈకు ఆనంద కుమార్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎస్ఈ టెండర్లు పిలిచామని త్వరలో పునరుద్ధరిస్తామని తెలిపారు. రైతులు జాస్తి శ్రీనివాసరావు, అనిమిరెడ్డి, కొర్ర రామయ్య, కృష్ణయ్య, పోదిల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్య: సీతారాంపురంలో పారిశుద్ధ్య పనులు చేపట్టడం లేదు. రోడ్ల వెంట చెత్త చెదారంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నాం.
- స్థానికుడు

సమాధానం: వర్షాలు చేపట్టి ఇబ్బందులు లేకుండా చూస్తాం - రమేశ్, ఎంపీడీవో
- కారేపల్లి, న్యూస్‌టుడే

జోనల్ క్రీడలు ప్రారంభం

మధిర, న్యూస్‌టుడే: మధిర జోనల్ స్థాయి క్రీడలు బుధవారం స్థానిక టీవీఎం పాఠశాలలో ప్రారంభమయ్యాయి. మధిర, ఎర్రుపాలెం, బోనకల్లు మండలాలకు చెందిన క్రీడాకారులు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడల్లో తలపడ్డారు. హైకోర్ట్ ఆసుపత్రి యాజమాన్యం దాదాపు వెయ్యి మంది క్రీడాకారులకు అవసరమైన భోజన సౌకర్యాలు అందించింది. పలువురు దాతలు జ్ఞాపికలు అందించేందుకు ముందుకు వచ్చారు. మండల విద్యాశాఖాధికారి వై. ప్రభాకర్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు దాతలకు అభినందనలు తెలిపారు. విజేతలకు అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, డి.సత్యనారాయణరెడ్డితోపాటు వెంకయ్య, టీవీఎం స్కూల్ వార్డెన్ కమిటీ సభ్యులు పి. సత్యనారాయణమూర్తి, చెరుపల్లి శ్రీహరి, ఎం.నాగేశ్వరరావు, కె.సుబ్బారావుతోపాటు బెజవాడ రవిబాబు బహుమతులు అందజేశారు.


మధిర: కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

జోనల్ స్థాయి క్రీడల్లో సత్తా: మధిర గ్రామీణం, న్యూస్‌టుడే: సిద్దినేనిగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు భీమరాజు బుధవారం తెలిపారు. సీనియర్ బాలుర విభాగంలో ఇద్దరు, బాలికల విభాగంలో ఒక విద్యార్థిని, జూనియర్ వాలీబాల్ విభాగంలో ముగ్గురు ఎంపికయ్యారన్నారు.


మధిర గ్రామీణం: జూనియర్ బాలికల విభాగంలో ఎంపికైన ముగ్గురు విద్యార్థినులు

డాన్‌బాస్కో పాఠశాలలో..: తల్లాడ, న్యూస్‌టుడే: వైరా జోనల్ స్థాయి పాఠశాలల క్రీడలు బుధవారం ఉత్సాహంగా సాగాయి. డాన్‌బాస్కో ఉన్నత పాఠశాలలో రెండో రోజు బాలురకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. వైరా, కొణిజర్ల, తల్లాడ, ఏన్కూరు మండలాల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లాస్థాయి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంఈవో ఎన్.దామోదరప్రసాద్, జోనల్‌క్రీడల కన్వీనర్ ప్రసూనకుమారి, హెచ్ఎం నరసింహారావు, పాల్గొన్నారు.

పదపద.. కరివెద

డివిజన్‌లో గణనీయంగా పెరిగిన సాగు విస్తీర్ణం

వేంసూరు, న్యూస్‌టుడే

వ్యవసాయంలో పెరుగుతున్న వ్యయాన్ని తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడి సాధించేందుకు రైతులు పలు మార్గాలను అన్వేషిస్తూనే ఉన్నారు. వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాలు అడుగంటడం, ఇవుడు దుక్కి సహా అన్నింట్లో కూలీల కొరత తదితర ఇబ్బందుల నేపథ్యంలో అన్నదాతలు వరి సాగులో కరివెద పద్ధతిని అవలంబిస్తున్నారు. నియోజక వర్గంలో ఈ సాగు విస్తీర్ణం ఏటేటా గణనీయంగా పెరుగుతుండటం గమనార్హం.


మర్లపాడులో సాగవుతున్న వరి

సత్తుపల్లి డివిజన్‌లో సాగు ఇలా		
మండలం	కరివెద	పూర్తి విస్తీర్ణం
కల్లూరు	14,970	33,340
వేంసూరు	11,946	24,165
తల్లాడ	8,364	22881
పెనుబల్లి	7,828	22,143
సత్తుపల్లి	439	17,625
మొత్తం	43,547	1,20,154

కూలీల కొరతతో..

గతంలో నాట్లు మొదలు నూర్పిడి వరకు యంత్రాలు ఉండేవికావు. యాంత్రీకరణ పెరిగింది. వరి నాట్లు మాత్రం రైతులకు ప్రహసనంగా మారాయి. యంత్రాలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో ఇప్పటికీ కూలీలపైనే ఆధారపడాల్సి వస్తుంది. ఎకరానికి రూ.5 నుంచి రూ.6వేల వరకు ఖర్చవుతున్నా అదునులో స్థానిక కూలీల కొరత తీవ్రంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో ఉత్తరాది రాష్ట్రాల నుంచి తీసుకొస్తున్నారు.


కలిసొస్తున్న మార్పు..

వరి నాట్ల విషయంలో కూలీల కొరత అధిగమించేందుకు ప్రత్యామ్నాయంగా వరి విత్తనాల నేరుగా వెదజల్లే ప్రక్రియ కరివెదను ప్రారంభించారు. దశాబ్దం క్రితం కందుకూరులో రెండెకరాల్లో ప్రారంభమైన ఈ పద్ధతి ఈ ఖరీఫ్ నాటికి సత్తుపల్లి డివిజన్‌లో వేల ఎకరాలకు విస్తరించింది. ఈ పద్ధతి ప్రయోజనాలు వ్యవసాయాధికారులు కూడా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

లాభమిలా..

- నాటు ఖర్చులు తగ్గటం
- దుక్కి ఖర్చు ఎకరానికి సుమారు రూ.2-3 వేలు ఆదా.
- తొలకరిలోనే విత్తనాలు చల్లడంతో పంటకాలం 20 రోజులు ముందుకు రావటం.
- 50శాతం సాగునీరు ఆదా.

✦ 'వరిలో కరివెద పద్ధతితో కలుపు సమస్య మినహా మిగతా అన్నీ అధిగమించవచ్చు. పంట కోత ముందు రావడంతో యాసంగి పంటలోనూ ప్రతికూల వాతావరణాల పరిస్థితులను అధిగమించవచ్చు.'


పి.రామమోహన్, ఏఓ, వేంసూరు.

'ప్రాథమిక విద్యకు తూట్లు'


పీఆర్‌టీయూ నూతన కార్యవర్గంతో ప్రమాణం చేయిస్తున్న జిల్లా బాధ్యులు

తల్లాడ, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ సర్దుబాటు జీవోలో మార్పు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం సంఘం మండల శాఖ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ పాఠశాల విద్యాసంచాలకులు ఈ నెల 20న విడుదల చేసిన మార్గదర్శకాలు, ప్రాథమిక విద్యకు తూట్లు పొడిచేలా ఉన్నాయన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు, ఆర్.బ్రహ్మారెడ్డి, దగ్గుల కమలాకర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నూతన కమిటీ: పీఆర్‌టీయూ మండల నూతన అధ్యక్షునిగా ఉంగరాల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా అద్దంకి గోపాలకృష్ణ, ఉపాధ్యక్షునిగా వై.రామిరెడ్డి, అసోసియేట్ అధ్యక్షునిగా పి.సైదులు, మహిళా ఉపాధ్యక్షురాలిగా బి.శారదాదేవి, మహిళా కార్యదర్శిగా జి.సరోజిని, గౌరవ అధ్యక్షునిగా కె.భాస్కర్‌ను ఎన్నుకున్నారు.

'ఎమ్మార్పీఎస్‌ను నడిపింది మాదిగలే'

వేంసూరు, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్‌ను స్థాపించింది మాదిగలేనని, వారికంటే వెనకబడిన 57 కులాలకు వర్గీకరణ ఫలాలు అందించడమే మంద కృష్ణమాదిగ లక్ష్యం అని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు ఏపూరి వెంకటేశ్వరరావు అన్నారు. మర్లపాడులో బుధవారం సాయంత్రం ఎమ్మార్పీఎస్ మండల సమావేశంలో మాట్లాడారు. సంఘం మండలాధ్యక్షుడు పింగళి నరేశ్, ఎంఎస్ఎఫ్ మండలాధ్యక్షుడు కిన్నెర రత్నకుమార్ పాల్గొన్నారు.

స్వచ్ఛతకు పెద్ద పీట వేయాలి

సత్తుపల్లి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ స్వచ్ఛతకు పెద్ద పీట వేయాలని కిష్టారం ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ జ్యోత్స్న అన్నారు. ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల విద్యార్థినులతో నీలాద్రి అర్బన్ పార్కు సమీపంలో పరిసరాలను పరిశుభ్రం చేయించారు.
✦ స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కమిషనర్ ఎం.రవిబాబు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

కారేపల్లి, న్యూస్‌టుడే: మూడు రోజుల క్రితం శాంతినగర్ ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో జరిగిన మండల స్థాయి క్రీడా పోటీలో ప్రతిభ కనబరిచిన వారికి బుధవారం కారేపల్లిలో బహుమతులు అందించారు. ఎస్సై రాజారామ్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, వైద్యుడు సామినేని రాఘవులు, ఎంఎన్ఓ కె.శ్రీనివాసరావు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

చింతకాని ఎంపీఓగా పర్వీన్ కైసర్

చింతకాని, కారేపల్లి, న్యూస్‌టుడే: చింతకాని ఎంపీఓగా పర్వీన్ కైసర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. సింగరేణి ఎంపీఓగా పనిచేసి బదిలీపై చింతకాని వచ్చారు. జిల్లావ్యాప్తంగా ముగ్గురు ఎంపీఓలను బదిలీ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. చింతకాని ఎంపీఓగా పని చేస్తున్న మల్లెల రవీంద్రప్రసాద్ పెనుబల్లి బదిలీ అయ్యారు. పెనుబల్లిలో ఉన్న ఉపేంద్రయ్య సింగరేణి మండలానికి బదిలీ అయ్యారు.

వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

మధిర, న్యూస్‌టుడే: వరద ముంపు బాధితులకు మండల ఆర్యవైశ్య సంఘం, రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం నాయకులు దేవకి వాసుదేవరావు విజ్ఞప్తి మేరకు శ్రీ రామకృష్ణ మిషన్ కోల్‌కతా వారి ఆర్థిక సహకారంతో బుధవారం మధిరలోని రామకృష్ణా సేవా సమితి ఆవరణలో నిత్యావసర సరకులు అందజేశారు. శ్రీస్వామి పూజానంద చేతులమీదుగా పంపిణీ చేశారు. తెదేపా రాష్ట్ర నాయకుడు వాసిరెడ్డి రామనాథం, దేవకి వాసుదేవరావు, వనమా వేణుగోపాలరావు, చారుగుండ్ల లక్ష్మీ నర్సింహారావు, కుంచం కృష్ణారావు, దాచేపల్లి ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.


వరద బాధితులకు నిత్యావసరాలు, ఇతర సామగ్రి అందజేస్తున్న దాతలు

క్రైస్తవుల వితరణ

కల్లూరు, న్యూస్‌టుడే: పెదకోరుకొండి, చిన్నకోరుకొండి, చెన్నూరు, ఎర్రబోయినపల్లి, వెంకటాపురం గ్రామాలకు చెందిన క్రైస్తవ సంఘాల వారు రూ.53వేల విలువైన బియ్యం, దుప్పట్లు, చీరలు మున్నేరు వరద బాధితులకు వితరణ చేశారు. పెదకోరుకొండి విచారణ క్రైస్తవులు, మత గురువులు స్టీఫెన్, దళ సభ్యులు.. ఖమ్మం ఆర్సీఎం పీఠాధిపతులు సగిలి ప్రకాష్‌కు వీటిని బుధవారం అందజేశారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

సత్తుపల్లి, న్యూస్‌టుడే: గౌరిగూడెంలో బుధవారం పేదలకు రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం యూనిట్ అధ్యక్షుడు సింగిరెడ్డి కేశవరెడ్డి రూ.15వేలతో దుప్పట్లను పంపిణీ చేశారు. అమెరికాలో ఉంటున్న తన కుమారుడు, కోడలు దినేశ్‌రెడ్డి, హారిక దంపతుల కుమార్తె పుట్టిన రోజును పురస్కరించుకుని వీటినదించారు.

పీహెచ్‌సీని సందర్శించిన డీఐఓ

పెనుబల్లి, న్యూస్‌టుడే: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆహ్లాదకరమైన వాతావరణంతో కొనసాగుతోందని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి చందు నాయక్ అన్నారు. లంకాసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పిల్లల కోసం ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. అన్ని గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్యాధికారి కిరణ్‌కు డీఐఓ సూచించారు. ఫార్మసిస్ట్ డే సందర్భంగా వైద్యశాల ఆవరణలో డీఐఓ మొక్కలు నాటారు. వైద్యాధికారి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యరమలకు తుమ్మల నివాళి

తల్లాడ, న్యూస్‌టుడే: ముద్దునూరు గ్రామ మాజీ సర్పంచి యరమల వెంకటేశ్వరరెడ్డికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి నివాళి అర్పించారు. రంగాపురం గ్రామానికి చెందిన యరమల మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. బుధవారం గ్రామంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు.

కల్లూరు, న్యూస్‌టుడే: ఇటీవల మృతి చెందిన గోపాలదేవబోయినపల్లికి చెందిన సంగెం వీరభద్రం చిత్రపటానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం నివాళులర్పించారు.


వెంకటేశ్వరరెడ్డి మృతదేహానికి నివాళి అర్పిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కొద్దిపాటి ఖర్చుతో కోతులకు చెక్..!

ఆ గ్రామంలో ఏ వీధిలో చూసినా కోతుల గుంపే.. ఏ ఇంటి ఆవరణలో కూరగాయ మొక్కలు పెరిగే పరిస్థితి లేదు. ఇళ్లలోకి చేరి వండుకున్న ఆహారాన్ని సైతం ఎత్తుకెళ్తుంటాయి. మహిళలపై దాడి చేస్తుంటాయి. ఈ సమస్యను జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి గ్రామస్థులు తీసుకెళ్లారు. వీటి నుంచి రక్షణ కోసం ఓ విశ్రాంత ఉద్యోగి తిమ్మినేని రామారావు వినూత్నంగా ఆలోచించారు. ఇంటి ఆవరణలోని 20 సెంట్ల భూమికి తక్కువ ఖర్చుతో కోతులు రాకుండా నివారించుకోగలిగారు. ఇంటి ఆవరణ చుట్టూ సుబాబుల్ కర్రలు ఏర్పాటుచేసి వాటికి వల కట్టారు. వలను చూసిన కోతులు భయపడి ఆ ఛాయలకు రాకుండా పోతున్నాయి. దీంతో ఆ రైతు ఇంటి ఆవరణలో వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరల, పెంచుతున్నారు. 'న్యూస్‌టుడే'కు తెలిపారు. – మధిర, న్యూస్‌టుడే



అడవి బిడ్డలకు వైద్యశిబిరం

కొత్త మేడేపల్లి అటవీ ప్రాంతంలోని గొత్తికోయల నివాసాల్లో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. చిన్నారుల్లో రక్తహీనత గుర్తించిన అధికారులు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. బురదలో వాహనాలు వెళ్లకపోవడంతో కిలోమీటరు దూరం ఆరోగ్య, ఐసీడీఎస్ సిబ్బంది కాలినడకన వెళ్లి చిన్నారులకు పరీక్షలు చేశారు. రక్తహీనత ఉన్న పిల్లలకు మందులు, వ్యాధినిరోధక టీకాలు అందించారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాములు, పీహెచ్ఎన్ పుణ్యవతి, సూపర్‌వైజర్లు భవాని, పుష్పరాణి, హెచ్ఏ దుర్గాప్రసాద్, రెండు శాఖల సిబ్బంది పాల్గొన్నారు. – ఏన్కూరు, న్యూస్‌టుడే



స్వయం ప్రతిపత్తిపై హర్షం: ఎమ్మెల్యే

సత్తుపల్లి, న్యూస్‌టుడే: స్థానిక జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్వయంప్రతిపత్తి రావడం హర్షణీయమని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. ఆ కళాశాలను బుధవారం సందర్శించి ప్రిన్సిపల్ ఎన్.గోపీ, అధ్యాపక బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. కళాశాలలో దెబ్బతిన్న రోడ్డు స్థానంలో సీసీ మంజూరు చేయాలని ప్రిన్సిపల్ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొన్నారు. ✦ స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రాగమయిని రేషన్ డీలర్లు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. భద్రాద్రికొత్తగూడెం జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షుడు ఊకే శేఖర్‌రావులతోపాటు పలువురు డీలర్లు సమస్యలను వివరించారు. ✦ స్థానిక జేవీఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో హోప్ మినిస్ట్రీస్ సంస్థ సహకారంతో వంద మంది మహిళలకు రాయితీపై కుట్టు మిషన్లు ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే మట్టా రాగమయి, దయానంద్ దంపతులు పంపిణీ చేశారు. సంస్థ బాధ్యులను ఎమ్మెల్యే అభినందించారు.


ఎమ్మెల్యే మట్టా రాగమయికి వినతి పత్రం అందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపక బృందం

విద్యతోనే దేశాభివృద్ధి: డీపీఓ

చింతకాని, న్యూస్‌టుడే: విద్యార్థులు సమాజంలో జరుగుతున్న మార్పులు గమనిస్తూ ఉన్నతంగా ఎదగాలని డీపీఓ ఆశాలత పేర్కొన్నారు. చింతకాని ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజన తీరును పరిశీలించి విద్యార్థులతో కలిసి ఆమె భోజనం చేశారు. మెనూ ప్రకారం అందించాలని నిర్వాహకులకు సూచించారు. డీఎల్‌పీఓ రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన: కొణిజర్ల, న్యూస్‌టుడే: కొణిజర్ల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని జడ్పీ సీఈఓ దీక్షా రైనా బుధవారం పరిశీలించారు. పాఠశాల ఆవరణతో పాటు మధ్యాహ్న భోజనశాలలను, వంట తయారీ విధానాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులు బయట కూర్చొని ఎందుకు భోజనం చేస్తున్నారని అడగగా ఉన్న డైనింగ్ హాల్ బాలికలకు మాత్రమే సరిపోతుందని ప్రధానోపాధ్యాయురాలు శాంతకుమారి తెలిపారు. మరొక హాల్‌కు ప్రతిపాదనలు పంపించాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రోజారాణి, ఎంఈఓ అబ్రహం పాల్గొన్నారు.


కొణిజర్ల: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సీఈఓ దీక్షా రైనా

టీపీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: టీపీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక స్థానిక ఉన్నత పాఠశాలలో బుధవారం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.విజయ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా కె.భూషణ్‌రాజు, సీతారామయ్య, ఉపాధ్యక్షురాలిగా రేణుక, ఇతర సభ్యులను ఎన్నుకున్నారు.

'గురుకుల సమస్యలు పరిష్కరించాలి'

మధిర, న్యూస్‌టుడే: గురుకుల పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక భట్టి క్యాంపు కార్యాలయం ఇన్‌ఛార్జికి బుధవారం టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. సొంత భవనాలు నిర్మించాలని, మెస్‌ఛార్జీల పెంపు, శౌచాలయాల నిర్మాణం చేపట్టాలని, 317 జీఓ ద్వారా ఇతర జోన్లకు కేటాయించిన వారిని సొంత జోన్లకు నియమించాలనే డిమాండ్లతో వినతిపత్రాన్ని క్యాంపు కార్యాలయం ఇన్‌ఛార్జి మహేష్‌కు అందజేశారు.

ప్రభుత్వం విఫలం: సీపీఎం

ముదిగొండ, న్యూస్‌టుడే: ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం రాష్ట్ర నాయకుడు పొన్నం వెంకటేశ్వరరావు విమర్శించారు. గోకినేపల్లిలో పయ్యావుల ప్రభావతి అధ్యక్షతన సీపీఎం గ్రామశాఖ మహాసభ బుధవారం నిర్వహించారు. అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని అన్నారు. జిల్లా నాయకుడు వాసిరెడ్డి వరప్రసాద్, మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, నాయకులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

పెనుబల్లి, న్యూస్‌టుడే: లంకాసాగర్‌క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డు దాటుతున్న పంజాబు రాష్ట్రానికి చెందిన బాల్గర్‌సింగ్ అనే వ్యక్తిని లారీ ఢీకొంది. ఓ హోటల్ ఎదుట తన లారీని ఆపి రోడ్డు దాటుతుండగా ఈ ప్రమాదం సంభవించింది. తీవ్రంగా గాయపడ్డ క్షతగాత్రుణ్ని పెనుబల్లి వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు.

ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి


కొప్పుల చెన్నారావు

సత్తుపల్లి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. కాకర్లపల్లికి చెందిన కొప్పుల చెన్నారావు(53) తన భార్య కుమారితో కలిసి మంగళవారం మేకలను మేపుకొని స్వగృహానికి వస్తున్నాడు. గ్రామ శివారులో రుద్రాక్షపల్లి వైపు వెళ్తున్న ఓ కారు చెన్నారావును ప్రమాదవశాత్తు ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ చెన్నారావును విజయవాడకు తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

మధిర, న్యూస్‌టుడే: వరదలతో నష్టపోయిన బాధితులకు కాకుండా రాజకీయ పలుకుబడి ఉన్నవారికి పరిహారం అందుతోందని పలువురు ఆరోపించారు. పలు గ్రామాల బాధితులు సీపీఎం నాయకులతో కలసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా నాయకులు శీలం నర్సింహారావు మాట్లాడుతూ.. రాజకీయ పెద్దలకు, ఇల్లు చెక్కుచెదరని వారికి, పలుకుబడి ఉన్న నాయకులకు మాత్రమే పరిహారం అందించడం దారుణమన్నారు. తొండలగోపవరం, మడుపల్లి, ఆత్కూరుతోపాటు పలు గ్రామాల్లో సమస్య నెలకొందని వినతి పత్రాన్ని తహసీల్దార్‌తోపాటు ఎంపీడీఓకు అందజేశారు. నాయకులు మద్దాల ప్రభాకర్, టి.రాధాకృష్ణ, విల్సన్, శ్రీనివాసరావు, కొండయ్య పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితులతో కలసి ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

గిరిజనులకు విద్యుత్తు సౌకర్యం కల్పించాలి..: పెనుబల్లి, న్యూస్‌టుడే: పోడు చేసుకుంటున్న గిరిజనులకు విద్యుత్తు, బోరు, మోటారు సౌకర్యం కల్పించాలని సీపీఎం జిల్లా నాయకుడు చలమాల విఠల్‌రావు డిమాండ్ చేశారు. పోడు పట్టాలిచ్చిన గిరిజనులకు విద్యుత్తు సౌకర్యం కల్పించి, బోరు వేయాలని పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఎంపీడీవో అన్నపూర్ణకు వినతి పత్రం అందజేశారు. అంతకుముందు గిరిజనులు ప్రదర్శనగా ఎంపీడీవో కార్యాలయం వరకు వెళ్లారు. నాయకులు గాయం తిరుపతిరావు, చిరంజీవి, గుడిమెట్ల బాబు, మిట్టపల్లి నాగమణి, రాజినేని మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమాజం స్వచ్ఛంగా ఉండాలి: న్యాయమూర్తి

మధిర పట్టణం, న్యూస్‌టుడే: స్వచ్ఛభారత్ కల సాకారానికి ప్రతి ఒక్కరి మనసు కూడా స్వచ్ఛంగా ఉండాలని మధిర కోర్టు న్యాయమూర్తి కార్తీక్‌రెడ్డి పేర్కొన్నారు. స్వచ్ఛభారత్ పక్షోత్సవాల్లో భాగంగా కోర్టు ఆవరణలో 'స్వచ్ఛతా హి సేవా' నిర్వహించారు. అనంతరం కోర్టు ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలు తొలగించి చెత్త, ప్లాస్టిక్ కవర్లు లేకుండా శుభ్రం చేశారు. హ్యూమన్ రైట్స్ సభ్యులు కోట వెంకట్, కన్నెపోగు వెంకటేశ్వర్లు, కమిషనర్ షఫీ ఉల్లా, కోర్టు సిబ్బంది, పాల్గొన్నారు.


పిచ్చిమొక్కలు తొలగిస్తున్న న్యాయమూర్తి కార్తీక్‌రెడ్డి, సిబ్బంది

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఏన్కూరు, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.వెంకటేశ్వరరావు(వైవీ), ఆర్.రంగారావు ప్రభుత్వాన్ని కోరారు. ఏన్కూరులో బుధవారం సంఘం మండల కార్యవర్గ ఎన్నికలో పాల్గొన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు చేయాలని, విశ్రాంత ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు విడుదల చేయాలన్నారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. 'మండల అధ్యక్షుడిగా చింతా రాజు, ప్రధాన కార్యదర్శిగా బత్తుల వెంకటేశ్వర్లు, పలువురు సభ్యులను ఎంపిక చేశారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కూరాకుల సైదయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు బ్రహ్మారెడ్డి, వైరా మండల అధ్యక్షులు వెలిశెట్టి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.


చింతా రాజు, బత్తుల వెంకటేశ్వర్లు

అమరవీరులకు నివాళి

ముదిగొండ, న్యూస్‌టుడే: ముదిగొండలోని భూపోరాట అమరవీరుల స్తూపం వద్ద భూపోరాట అమరవీరులకు, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి సీపీఎం నాయకులు, ప్రజా నాట్యమండలి కళాకారులు బుధవారం నివాళులర్పించారు. రాష్ట్ర నాయకుడు పొన్నం వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి పురుషోత్తం, జిల్లా నాయకుడు వాసిరెడ్డి వరప్రసాద్, నాయకులు రాయల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రుణం.. సద్వినియోగం

సత్తుపల్లి, న్యూస్‌టుడే

డ్వాక్రా సంఘాల్లో చేరిన మహిళలు బ్యాంకు, స్త్రీనిధి, ముద్రా తదితర రుణ సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. వచ్చిన రుణంతో ఉపాధి పరిశ్రమలు నెలకొల్పి విజయవంతంగా నిర్వహిస్తూ పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. సత్తుపల్లి మండలం సదాశివునిపాలేనికి చెందిన జి.సత్యవాణి డ్వాక్రా సంఘంలో చేరి రుణాలను తీసుకుంటూ వ్యాపార కార్యకలాపాలను విస్తరిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.


ఫ్లోర్, టాయిలెట్, వాషింగ్ క్లీన్ లిక్విడ్లు

సత్యవాణి రోజువారీ కూలీగా పనులు చేస్తూ భర్త సీతయ్యకు చేదోడువాదోడుగా ఉండేవారు. 2003లో స్వయం సహాయక సంఘంలో చేరారు. మూడేళ్ల క్రితం రూ.లక్ష రుణంతో ఇస్తరాకుల మిషన్ ఏర్పాటు చేశారు. వాటితో ఇస్తరాకులు, టీ గ్లాసులు, వాటర్ గ్లాసులు, టిఫిన్ ప్లేట్లు తయారు చేస్తున్నారు. ఏడాదికి రూ.3.6 లక్షల ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. మరో అడుగు ముందుకేసి కొన్నేళ్ల క్రితం రూ.2లక్షల రుణం తీసుకుని ఇళ్లు, బాత్ రూంలు, శౌచాలయాలు శుభ్రం చేసే క్లీనర్లు, వంటింటి పాత్రలు శుభ్రం చేసే లిక్విడ్లు, వాషింగ్ మిషన్‌లో వాడే ద్రావలతోపాటు దుస్తులు సువాసన వెదజల్లే లిక్విడ్‌లను తయారు చేసే వ్యాపారాన్ని ప్రారంభించారు. మొత్తం రూ.5లక్షల రుణంతో హైదరాబాద్, ఏపీలోని గుంటూరు వంటి ప్రాంతాల నుంచి ముడిసరకు తెప్పించుకున్నారు. వాటి సాయంతో లిక్విడ్‌లను తయారు చేస్తూ ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారు. తాజాగా హైదరాబాద్ నుంచి నేరుగా తయారీ కంపెనీలతో మాట్లాడుకుని పెద్ద మొత్తంలో ముడి పదార్థాలు తెచ్చుకున్నారు. లీటర్, అర లీటర్ సీసాల్లో లిక్విడ్లను విక్రయిస్తున్నారు. ఈ వ్యాపారంలోనూ ఏడాదికి రూ.3.5 లక్షల గడిస్తున్నారు. తమ సంపాదనతో ఇద్దరు కుమారులను ఉన్నతంగా చదివించారు. ప్రస్తుతం వారు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నట్లు సత్యవాణి పేర్కొన్నారు.


సత్యవాణి

ఖమ్మం

• ఖమ్మం • పాలేరు

శుద్ధి కేంద్రానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: ధంసలాపురంలో మురుగునీటి శుద్ధి కేంద్రం ప్రతిపాదిత స్థలాన్ని కమిషనర్ అభిషేక్ అగస్త్య బుధవారం పరిశీలించారు. అనంతరం ఖానాపురంలో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ పనులు, అక్కడి నగరపాలక సంస్థకు చెందిన ఖాళీ స్థలాలను పరిశీలించారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. అక్రమ కట్టడాలుంటే పరిశీలించాలని ప్రణాళిక విభాగం అధికారులకు సూచించారు. సహాయ కమిషనర్ సంపత్‌కుమార్, ఈఈలు కృష్ణలాల్, రంజిత్, ఏసీపీ వసుంధర తదితరులు ఉన్నారు.

వరద బాధితులకు ‘మీ సేవా’ కేంద్రం

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: వరదల సమయంలో ధ్రువపత్రాలు కోల్పోయిన వారి కోసం రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో మీ సేవా కేంద్రాన్ని తహసీల్దారు రాంప్రసాద్ బుధవారం ప్రారంభించారు. ఆదాయ, కుల, నివాస, ఆధార్ వంటి ధ్రువపత్రాలు కోల్పోయిన ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వరద ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను ఎంపీడీఓ కుమార్ పర్యవేక్షించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఖమ్మం: 80085 52623, 80085 73668
రఘునాథపాలెం: 8008573674
పాలేరు: 97010 67081

సమస్య: నగరంలోని మామిళ్లగూడెం హోమియో ఆసుపత్రి ఎదురు సందులో కొన్ని రోజులుగా చెత్త పేరుకుపోవడంతో సమస్యను స్థానికులు ‘మేమున్నాం..మీకుతోడుగా’ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యను సంపత్‌కుమార్‌కు వివరించగా, ఆయన ఆదేశాల మేరకు చెత్తను తొలగించారు.

– ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుపై శిక్షణ

ఖమ్మం రోటరీనగర్, న్యూస్‌టుడే: విద్యుత్తు నియంత్రికల మరమ్మతుపై సిబ్బందికి శిక్షణ కార్యక్రమం ఖమ్మం విద్యుత్తు విశ్రాంతి భవనంలో బుధవారం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన వజ్ర ట్రాన్స్‌ఫార్మర్స్ ప్రతినిధులు సిబ్బందికి మరమ్మతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ నుంచి వచ్చిన టీజీఎన్పీడీసీఎల్ సీజీఎం కిషన్ పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో ఎస్ఈ ఎ.సురేందర్, ఎంఆర్‌టీ డీఈ భద్రుపవార్, సిబ్బంది పాల్గొన్నారు.




సీజీఎం కిషన్‌కు స్వాగతం పలుకుతున్న డీఈ భద్రుపవార్, వేదికపై ఎస్ఈ సురేందర్

అద్దె భారం.. సమస్యల తీరం

◆ సొంత భవనాలు, సిబ్బంది లేక ఇక్కట్లు

ఖమ్మం కమాన్‌బజార్, రఘునాథపాలెం, న్యూస్‌టుడే

ఖమ్మం అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టులో ఖాళీ పోస్టుల భర్తీకి మోక్షం కలగడం లేదు. ప్రాజెక్టు పరిధిలో 46 పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. టీచరు, హెల్పర్ ఉద్యోగాల్లో ఖాళీలు ఏర్పడటంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఫలితంగా లబ్ధిదారులకు ఆశించిన మేరకు సేవలు లభించడం లేదు. ఏళ్లుగా వందల సంఖ్యలో కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నా శాశ్వత పరిష్కారం దొరకడం లేదు. జిల్లాలోనే అత్యంత ప్రాధాన్యం కలిగిన ప్రాజెక్టుపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



ప్రాజెక్టు పరిధిలో లబ్ధిదారులు ఇలా..	గర్భిణులు	బాలింతలు	0-6 ఏళ్ల పిల్లలు
	2,069	1,610	18,413

అద్దె భవనాల్లో 196 కేంద్రాలు

ప్రాజెక్టు ప్రారంభం నాటి నుంచి వందల సంఖ్యలో కేంద్రాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. నగరంలో 19 సొంత భవనాల్లో ఉండగా.. 11 ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఇక అద్దె భవనాల్లో 182 కేంద్రాలను నడుపుతున్నారు. రఘునాథపాలెం మండలంలో 29 సొంత భవనాలు ఉండగా.. 31 ప్రభుత్వ భవనాల్లో ఉన్నాయి. మరో 14 అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. దీంతో కేంద్రాలకు ప్రభుత్వం నుంచి అద్దెలు సకాలంలో విడుదల కాకపోవడంతో టీచర్లపై ఆర్థిక భారం పడుతోంది. అద్దెల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే కేంద్రాల్లో మౌలిక వసతుల కొరత సమస్యగా మారింది.

ఖాళీలు 46

ఖమ్మం అర్బన్ ప్రాజెక్టు పరిధిలో ఖమ్మం కార్పొరేషన్‌తో పాటు రఘునాథపాలెం మండలానికి చెందిన అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. మొత్తం 286 కేంద్రాలు గర్భిణులు, చిన్నారులకు సేవలందిస్తున్నాయి. కొన్నేళ్లుగా 46 కేంద్రాల్లో సిబ్బంది లేరు. ఎనిమిది టీచరు, 38 హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో రికార్డుల నిర్వహణ, ప్రీస్కూల్ విద్య, పోషకాహార పంపిణీ, చిన్నారుల ఆలనాపాలన, ఇతర సంక్షేమ కార్యక్రమాల అమలు ప్రక్రియ నామమాత్రంగా జరుగుతోంది. ఖాళీగా ఉన్న కేంద్రాల బాధ్యతలను సమీప కేంద్రాలకు చెందిన టీచర్లకు అప్పగించి సేవలందిస్తున్నారు. విధి నిర్వహణలో ఇప్పటికే వారు పలు ప్రభుత్వ కార్యక్రమాలతో సతమతమవుతున్నారు. అదనంగా బాధ్యతలు నిర్వహించాల్సిన పరిస్థితుల్లో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో మరో వైపు లబ్ధిదారులు సకాలంలో ప్రభుత్వ సేవలు పొందలేకపోతున్నారు.

కార్పొరేషన్ కబుర్లు

★ తమకు పరిహారం అందలేదని, పేర్లు జాబితాలో లేవని అనేక మంది నగరపాలక సంస్థ కార్యాలయానికి చేరుకొని సిబ్బంది కొద్దిసేపు వాగ్వాదానికి దిగారు. ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తే తప్ప తాము దరఖాస్తు తీసుకోలేమని వారు చెప్పడంతో నిరాశగా వెనుదిరిగారు.

★ నగరంలోని 8వ డివిజన్ గోపాలపురం నుంచి ఎల్‌బీనగర్ వరకు నిర్మిస్తున్న సీసీరోడ్డుకు సంబంధించి స్థానికులకు, గుత్తేదారుకు మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది.

★ నగరపాలక సంస్థ పరిధిలో పెండింగ్‌లో ఉన్న వీధి వ్యాపారుల రుణాలు మంజూరు చేసేందుకు మెప్మా సిబ్బంది దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించారు.

– ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

మంచుకొండలో డిప్యూటీ సీఈఓ పర్యటన

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి బుధవారం మంచుకొండలో పర్యటించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్మికులకు నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని పరిశీలించారు. వైద్యుడిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఆహారం నాణ్యతను పరిశీలించి, మెనూ అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ అశోక్ కుమార్, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న నాగలక్ష్మి తదితరులు

హౌజింగ్ సొసైటీ అధ్యక్షుడిగా సైదులు



ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: స్తంభాద్రి హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ ఖమ్మం అధ్యక్షుడిగా కనకం సైదులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం మంచికంటి భవనంలో మూడు సంఘాల ప్రతినిధులు సమావేశమయ్యారు. ఇళ్ల స్థలాల సాధనకు తీసుకోవాల్సిన కార్యాచరణపై తొలుత చర్చించారు. పలు తీర్మానాలు చేశారు. మూడు సంఘాల నుంచి సలహా కమిటీని నియమించుకోవాలని నిర్ణయించారు.

ముమ్మరంగా సభ్యత్వ నమోదు

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని ఖమ్మం 13వ డివిజన్ శ్రీనగర్ కాలనీలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆ పార్టీ నాయకుడు తాండ్ర వినోద్‌రావు పలువురికి సభ్యత్వం అందించారు.

★ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి ఖమ్మంలో 24వ డివిజన్ పాకబండ బజార్‌లో పార్టీ సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు.

భాజపా మండల అధ్యక్షుడిగా సుధాకర్



నేలకొండపల్లి, న్యూస్‌టుడే: భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడిగా కొత్తకొత్తూరుకు చెందిన పాగర్తి సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఉపేందర్‌గౌడ్, కృష్ణారావు పాల్గొన్నారు.

ఐకాస రాష్ట్ర వైఎస్ ఛైర్మన్‌గా సైదులు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: తెలంగాణ ఉద్యోగుల రాష్ట్ర ఐకాస వైస్ ఛైర్మన్‌గా ఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండు రోజుల కిందట హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. ఆయా ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

‘పమ్మి సెక్షన్ ప్రమాదంపై విచారణ చేపట్టాలి’

ఖమ్మం రోటరీనగర్, న్యూస్‌టుడే: పమ్మి సెక్షన్‌లో జరిగిన ప్రమాదంపై నిష్పక్షపాత విచారణ జరిపి, క్షతగాత్రుడు ఏఎల్ఎం లింగం పున్నయ్యకు న్యాయం చేయాలని విద్యుత్తు ఉద్యోగుల సంఘం(1104) ప్రాంతీయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శేషగిరిరావు డిమాండ్ చేశారు. ఉపకేంద్రంలో విధుల్లో ఉన్న పున్నయ్య తనే క్షేత్రస్థాయి వెళ్లాడని డీఈ చెప్పడాన్ని ఖండిస్తున్నామన్నారు.

కలెక్టర్‌కు కళాకారుల వినతి

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: భక్తరామదాసు కళాక్షేత్రంలో వసతులు కల్పించాలని కోరుతూ బుధవారం సీనియర్ కళాకారులు కలెక్టరేట్‌లో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి తుమ్మల ఇచ్చిన హామీ పత్రాన్ని కలెక్టర్‌కు సమర్పించారు.

ముగిసిన ఖమ్మం సౌత్ క్రీడలు

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: నగర దక్షిణ మండల పాఠశాల క్రీడలు బుధవారం ఖమ్మం పటేల్ స్టేడియంలో ముగిశాయి. ఖమ్మం శ్రీచైతన్య పాఠశాల జట్టు ఛాంపియన్‌షిప్ సొంతం చేసుకొంది. బాలికల విభాగంలో హార్వెస్ట్ స్కూల్, బాలుర విభాగంలో ఎస్.ఆర్. ప్రైం స్కూల్ ఛాంపియన్లుగా నిలిచాయి. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ అంశాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు గెల్చుకున్న వారికి డీవైఎస్‌ఓ సునీల్‌రెడ్డి బహుమతులు అందజేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు, వివిధ విద్యాసంస్థల యాజమాన్య సభ్యులు పాల్గొన్నారు.

పొంచి ఉంది ముప్పు



జాస్తిపల్లిలో నిమ్మవాగు సమీపంలోని పంట చేలకు వెళ్లే రహదారి బురదమయంగా మారింది. రహదారిపై రాకపోకలు సాగించేందుకు అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు బురదలో దిగుబడి పోతున్నాయని, పంచాయతీ అధికారులు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

– కామేపల్లి, న్యూస్‌టుడే

ఈ రోడ్డుపై రొప్పాల్సిందే..



ఖమ్మం-కామంచికల్లు ప్రధాన రహదారిలో రాకపోకలు సాగించాలంటే వాహనదారులు హడలిపోతున్నారు. ఎన్నెస్పీ కాల్వ నుంచి కాలనీ వరకు రహదారిపై అడుగుకో గుంత ఏర్పడింది. వర్షం పడిన ప్రతిసారీ గుంతల్లో నీరు నిలవడంతో వాహనదారులు, పాదచారులకు చుక్కలు కనబడుతున్నాయి. మరమ్మతులు చేపట్టాలని ఈ దారిన వెళ్లే దానవాయిగూడెం, రామన్నపేట, కామంచికల్లు, దారేడు, పడమటితండా, పాపటపల్లి, దోర్నకల్లు ప్రాంతాల వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

– రఘునాథపాలెం, న్యూస్‌టుడే



ఖమ్మం కమాన్‌బజార్: మంత్రి తుమ్మలకు రూ.5 లక్షల చెక్కు అందజేస్తున్న సిరి సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ మురళీ కృష్ణ తదితరులు



ప్రముఖ ఐటీ కంపెనీ పంపిన నిత్యావసరాలను వరద బాధితులకు అందజేస్తున్న మేయర్ పునుకొల్లు నీరజ



ఖమ్మం న్యాయవిభాగం: దుప్పట్లు అందజేస్తున్న ఐఏఎల్ న్యాయవాదులు

బాధితులకు చేయూత

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం 320ఈ ఆధ్వర్యంలో ధంసలాపురం కాలనీలో నిత్యావసర సరకుల కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు.

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: సిరి సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిని మురళీకృష్ణ, అరిమిలి వివేకానంద్, రాకేశ్‌రెడ్డి రూ.5 లక్షల చెక్కును మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు అందచేశారు. గుత్తా జానకీరామ్ రూ.1 లక్ష చెక్కు అందించారు. ★ కవిరాజ్‌నగర్ వరద ముంపు ప్రాంతంలో హైదరాబాద్ యశోద, ఖమ్మం శరత్ మ్యాక్స్ విజన్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బి.లక్ష్మీకాంత్, సిద్ధు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో వైద్యులు రోగులను పరీక్షించి చికిత్సలు అందించారు.

ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: కస్నాతండా వాసులకు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) ఆధ్వర్యంలో బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఐఏఎల్ జిల్లా అధ్యక్షుడు షేక్ లతీఫ్, కార్యదర్శి శేషగిరిరావు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత: మేయర్

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరు బాధ్యతగా స్వీకరించాలని మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా నగరంలోని లకారం ట్యాంకుబండ్‌పై బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అక్టోబరు రెండో తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సహాయ కమిషనర్ సంపత్ కుమార్, కార్పొరేటర్లు ఆళ్ల నిరీష, సరిపూడి రమాదేవి, సిబ్బంది సాంబయ్య, శ్రీనివాస్, స్థానికులు సరిపూడి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



రహదారిని శుభ్రం చేస్తున్న మేయర్ నీరజ, కార్పొరేటర్లు, అధికారులు

ఘన నివాళి



శత జయంతి సందర్భంగా ఏబీ బర్దన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, కొండపర్తి గోవిందరావు, బీజీ క్లెమెంట్, తాటి తదితరులు.

– ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే



ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖ న్యాయవాది కొల్లి సత్యనారాయణ, జేఎన్‌యూ పూర్వ విద్యార్థి బొంతు రాంబాబు, టి.ప్రవీణ్, నాయకులు

– ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే

ఫార్మసిస్టులకు సన్మానం

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: సర్వజనాసుపత్రిలో బుధవారం ఫార్మసిస్టు డే సందర్భంగా వేడుకలు నిర్వహించారు. వైద్యాధికారులు కేకు కోసం ఫార్మసిస్టులకు పంచిపెట్టారు. అనంతరం వారిని శాలువాలతో సత్కరించారు. ప్రిన్సిపల్ రాజేశ్వరరావు, సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, ఏడీ సంతోష్, డిప్యూటీ సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్, ఆర్ఎంఓలు కళావతిబాయి, రాంబాబు, ఫార్మసీ సూపర్‌వైజర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



కేకు కోస్తున్న వైద్యాధికారులు, ఫార్మసిస్టులు

బాధ్యతల స్వీకరణ



వీరస్వామి

కూసుమంచి, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాయల వీరస్వామి బుధవారం ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

కామేపల్లి, న్యూస్‌టుడే: విద్యావనరుల భవనంలో ఎంఈవోగా జి.వెంకట్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. పలువురు ఉపాధ్యాయులు, సీఆర్పీలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

సామాన్యులకు నాణ్యమైన ఔషధాలు

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: నాణ్యమైన జనరిక్ మందుల విక్రయశాల ఏర్పాటు చేస్తున్నామని వీవీసీ ట్రస్టు అధినేత వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. వీవీసీ, బీవీకే సంయుక్త ఆధ్వర్యంలో ఖమ్మం వైరా రోడ్డులో సత్యనారాయణ ఆసుపత్రి కాంప్లెక్స్‌లో దీన్ని ఏర్పాటు చేశారు. వంకాయలపాటి ద్రౌపతి, అధినేత రాజేంద్రప్రసాద్, నున్నా నాగేశ్వరరావు పొన్నం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కారు డ్రైవర్‌కు గాయాలు

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: కారు డివైడర్‌ను ఢీకొని డ్రైవర్‌కు గాయాలైన సంఘటనపై రఘునాథపాలెం పోలీసు స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. ఖమ్మం-ఇల్లెందు ప్రధాన రహదారిలో మండల కేంద్రం రఘునాథపాలెం కోయచలక క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం ఖమ్మం వైపు వస్తున్న కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. దానవాయిగూడేనికి చెందిన డ్రైవర్ తిరుపతిరావు గాయపడి చికిత్స పొందుతున్నాడు. కేసు విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన వడ్డేపల్లి కోటయ్య అనే వ్యక్తి సోమవారం అదృశ్యమయ్యాడు. ఈయనకు మాటలు రావని, ఎదుటి వారి మాటలను అర్థం చేసుకోగలడని కుటుంబీకులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్సై సంతోష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో ఘర్షణ

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: నేలకొండపల్లిలోని ఓ వైన్స్ దుకాణం వద్ద ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. ఈ ఘటనలో ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదైంది. మద్యం మత్తులో దుకాణం ఎదుట ఘర్షణ పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. సమాచారమందుకున్న పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై సంతోష్ తెలిపారు.

భవనంపై పిడుగుపాటు



రఘునాథపాలెం, న్యూస్‌టుడే: నివాస భవనంపై పిడుగు పడిన సంఘటన రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం జగ్యాతండాలో మంగళవారం రాత్రి జరిగింది. స్థానికుడు బాణోతు నాగేశ్వరరావు ఇంటిపై భారీ వర్షం సమయంలో పెద్ద శబ్దంతో పిడుగు పడింది. దీంతో భవనం పైభాగం దెబ్బతిన్నది. ఇంట్లో విద్యుత్తు ఉపకరణాలు కాలిపోయాయి. రూ.2 లక్షలకు పైగా నష్టం జరిగిందని చెప్పారు. సంఘటన స్థలాన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణ బుధవారం సందర్శించి వివరాలను సేకరించారు.

వ్యవసాయ అనుబంధ పరిశ్రమలపై అవగాహన

కూసుమంచి, న్యూస్‌టుడే: మహిళా శక్తి ఆధ్వర్యంలో సమీకృత వ్యవసాయ అనుబంధ పరిశ్రమల నిర్వహణపై సెర్ప్ ఆధ్వర్యంలో జుజ్జులరావుపేటలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కోడిపిల్లలు, చేపలు, గొర్రెల పెంపకం, పాడిపరిశ్రమ తదితర పరిశ్రమలు నిర్వహిస్తున్న కేంద్రంలో జిల్లాలోని ఏపీఎంలకు అవగాహన కల్పించారు. నిర్వహణ బారి నాగేశ్వరరావు దంపతులు తీరును వివరించారు. డీఆర్‌డీవో సన్యాసయ్య అదనపు డీఆర్‌డీవో నూరుద్దీన్, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, డీపీఎంలు శ్రీను, పద్మ, ఏపీఎం సత్యవర్ధన్‌రాజు పాల్గొన్నారు.



అజొల్లా పెంపకంపై అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

గట్టు సమస్య..!

పాలేరు ఏటికి ఎన్నడూ లేని స్థాయిలో వరద రావడంతో పరీవాహక ప్రాంతాల్లోని విద్యుత్ సరఫరా దెబ్బతింది. ఏటికి రెండు వైపులా స్తంభాలు విరిగిపోయాయి. వందల సంఖ్యలో నియంత్రికలు నేలకూలాయి. విద్యుత్తు లైన్లు తెగిపోయాయి. ఇప్పుడిప్పుడే వీటి పునరుద్ధరణ పనులు కొలిక్కి వస్తున్నా ఏటి తీరంలో వందల మంది రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. – నేలకొండపల్లి, న్యూస్‌టుడే

◆ పాలేరు ఏటి తీరంలో రైతుల కరెంటు కష్టాలు

గతంలో పాలేరు ఏటిపై చెక్‌డ్యాంలు లేకపోవడంతో నీరు ఎప్పుడూ దిగువకు ప్రవహిస్తూ ఉండేది. ఏటి నీటిని సద్వినియోగం చేసుకునే ఉద్దేశంతో పలు చెక్‌డ్యామ్‌లు నిర్మించారు. దీంతో కొద్దిపాటి వర్షాలకూ ఏరు నిండుగా ఉంటోంది. ఈ క్రమంలో సాగుకోసం రెండు వైపులా రైతులు కరెంటు మోటార్లు ఏర్పాటు చేసుకున్నారు. ఖమ్మం జిల్లాలోని కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లో సుర్దేపల్లి, చెన్నారం, రామచంద్రాపురం, పైనంపల్లి, జక్కేపల్లి తదితర గ్రామాల రైతులు తమ పొలాలకు ప్రారంభంలో సూర్యాపేట జిల్లా నుంచి కరెంటు కనెక్షన్ తీసుకున్నారు. డీడీలను చెల్లించడంతో వీరికి అక్కడి నుంచే విద్యుత్తు సరఫరా అవుతోంది. ఇదే సందర్భంలో నల్గొండ జిల్లా వైపున్న కొన్ని పొలాలకు ఖమ్మం జిల్లా నుంచి విద్యుత్ సరఫరా అవుతోంది. విద్యుత్ సరఫరాలో సమస్య తలెత్తినప్పుడు, నియంత్రికలు పాడైనప్పుడు, లైన్లు కూలిపోయినప్పుడు పునరుద్ధరణ ఇబ్బందిగా మారింది. సూర్యాపేట ఎన్పీడీసీఎల్ పరిధిలో ఉండగా, ఖమ్మం ఎన్పీడీసీఎల్‌లో భాగం. మొన్నటి వరదలకు రెండువైపులా రైతులు భారీగా నష్టపోయారు. నేటికీ పునరుద్ధరణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి.



‘ఇప్పటికే వేరే జిల్లా కనెక్షన్ ఉన్నవారికి అదే బ్యాంకు డిమాండ్ డ్రాఫ్ట్ సరఫరా ఇస్తాం. కొత్తగా ఎవరూ డీడీ చెల్లించాల్సిన పనిలేదు. జిల్లా, మండలం మారినా ఇబ్బంది లేదు. రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదు.’

– ఎ.సురేందర్, ఎస్ఈ

ఎవరేమంటున్నారు?

★ రెండు డిస్కంల పరిధిలో ఉండటంతో స్థానిక అధికారులు సమస్య పరిష్కారానికి నిర్ణయం తీసుకునే వీల్లేకుండా పోయింది. రైతులు తాము చెల్లించిన డీడీలను మార్చాలని విన్నవిస్తున్నారు.

★ అధికారులు లైన్లను పునరుద్ధరిస్తామని, సరఫరా మాత్రం ఎక్కడి డీడీ ఉంటే అక్కడి నుంచే తీసుకోవాలని సూచిస్తున్నారు.

★ మళ్లీ వరదలు వస్తే సమస్యలు ఎదురవుతాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. మరమ్మతుల సమయంలోనూ రెండు కేంద్రాల లైన్లు ఒకే ప్రాంతంలో ఉండటంతో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశమూ లేకపోలేదు.

★ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టి సారించి, సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

మూసి ఉన్న గేటు దాటితే చేటు

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: మూసి ఉన్న రైల్వే గేటును దాటడం, రైలు పట్టాలపై ఇష్టానుసారంగా వెళ్లడం చట్టరీత్యా నేరమని ఖమ్మం రైల్వే రక్షక దళం(ఆర్పీఎఫ్) ఇన్‌ఛార్జి సీఐ సురేశ్‌బాబు తెలిపారు. ఆర్పీఎఫ్ ‘రైజింగ్ డే’ సందర్భంగా బుధవారం ఖమ్మం రైల్వేస్టేషన్, పరిసర ప్రాంతాల్లో అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ.. రైల్వే లెవల్ క్రాసింగ్ గేటు దాటేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఏఎస్సై ప్రసన్నకుమార్, హెడ్‌కానిస్టేబుల్ చిన్న రామయ్య, కానిస్టేబుల్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



గాంధీచౌక్ మధ్య గేటు వద్ద అవగాహన కల్పిస్తున్న సురేశ్‌బాబు